ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

అక్టోబర్ 19, 2014



'బాల' యోధులు

తారల దీపావళి

దీపావళి అంటే చాలు. ఎక్కడ లేని హుషారు వచ్చేస్తుంది ఎవరికైనా. మరి టపాసుల పండుగరోజు ఆ మాత్రం సందడి లేకపోతే ఏం బావుంటుంది. కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, మతాబులు, సీమటపాకాయలు, రకరకాల బాంబులు, లక్ష్మీ ఔట్లు... ఎన్నని చెప్పడం. ఇదంతా మనం ప్రతిసారీ జరుపుకునే, చెప్పుకునే సందడి. అదే సినీ తారలైతే? దీపావళి ఎలా జరుపుకుంటారు? తారలైనా, సితారలైనా...దీపావళి జరుపుకోరా ఏంటీ?! పండగ సందర్భంగా షూటింగులన్నీ హుష్ కాకి అయిపోవూ. ఎంచక్కా... దీపావళి సందడే సందడి. బాలీవుడ్ తారలు షారూక్ ఖాన్, కరిష్మా కపూర్, సల్మాన్ ఖాన్, సన్నీ డియోల్, శిల్పా షెట్టి, మందిరా బేడి, సునీల్ షెట్టి, కంగనా రౌనత్, సెలీనా జైట్లీ, తుషార్ కపూర్, రిషి కపూర్, అనిల్ కపూర్, జితేంద్ర, ఐశ్వర్యా రాయ్, ఆమీర్ ఖాన్.... మన ముందు కొచ్చారు. అధికంగా వీరు కాకరపువ్వొత్తులే కాల్చుతున్నట్టున్నా... సునీల్ షెట్టి మాత్రం చిచ్చుబుడ్డి వెలిగించబోతున్నాడు. అనిల్ కపూర్ చూశారా! పూర్తి బందోబస్తుతో సీమటపాకాయలు పేల్చబోతున్నాడు. 'మిస్టర్ ఇండియా' గారికి సీమ టపాసులు కాల్చడం ఓ లెక్కా చెప్పండి.

ఇదండీ తారల దీపావళి సచిత్రకథనం. సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో.. రిస్కుతో... ఆనందంగా... సంతోషంగా జరుపుకోవాలి దీపావళి. ప్రజాశక్తి పాఠకులందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు.

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

సొంత లాభం ...

◆ మనలో మాట

'సొంత లాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడుపడవోయ్...' అన్నాడు గురజాడ. మాష్టార్లు సైతం ఈ మాటను వల్లెవేయించారు. ఆచరణలోనూ అదే చూపమన్నారు. ఇంట్లో పెద్దలూ అదే మాట చెప్పేరు. స్కూల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో పెద్దల మాట ఒకటే అయినప్పుడు మెదడులో నాటుకుపోకుండా ఎలా వుంటుంది ఎవరికైనా!

అది మనలాంటి సామాన్యుల సంగతి. కొంతమంది రాజకీయ నాయకుల రూటే సప'రేటు'. వారు దాన్ని పూర్తి భిన్నంగా వంటబట్టించేసుకున్నారు. ఏం చేసినా దానికి ఎంతో కొంత 'విలువ' వుండేలా చూసుకోవడంలో వీరు సిద్ధహస్తులు. ఉత్తుత్తి కబుర్లు ఎన్ని చెప్పినా... 'సొంత' విషయానికే తొలి ప్రాధాన్యత. జరుగుతున్న ఘటనలు, వినవస్తున్న ప్రకటనలు, కనిపిస్తున్న కథనాలే అందుకు సాక్ష్యం.

భార్య అనుమానాస్పద మృతితో వార్తలకెక్కిన మాజీ కేంద్రమంత్రిగారు తాజాగా ఈ విషయాన్నే రుజువు చేశారు. 'స్వచ్ఛ భారత్'కు వంత పాడేశారు లయబద్ధంగా. చేతిగుర్తు వారికి వళ్లు మండింది. 'శార్! నిన్ను గెలిపించడానికి కార్యకర్తలు ఎంతగా చెమటోడ్చారు? అదంతా మరిచిపోయి పువ్వు పక్షం వారిని పొగుడుతావా!?' అంటూ తమ పార్టీ పదవి నుంచి పీకిపడేశారు. ఈయనగారొక్కడేనా! చెప్పకోవాలేకానీ చేంతాడంత జాబితా ఇది. హస్తం గుర్తు మీద గెలిచి ... పదిహేనేళ్లపాటు హస్తినను ఏలిన మేడమ్‌గారు సైతం అదే చేసేశారు. రాష్ట్రంలో 'పువ్వు పార్టీ వారు అధికారంలోకి వస్తే మంచిదే' అనేశారు. దాంతో పరాజయ భారంతో కుంగిపోతున్న చేతి గుర్తువారికి ఏడుపే తక్కువైందనుకోండి.

స్వపక్షంలో విపక్షులు వీరంతా. ప్రతిపక్ష జపం చేస్తుంటారు నిత్యం. వీరికంటే నాలుగాకులు ఎక్కువ చదివిన వారూ వున్నారు. వీరు జపం కాదు. ఏకంగా జంపే! రాజస్యసభ ఉపసభాపతిగా, చేతిగుర్తు నాయకిగా ముద్ర పడిపోయిన మేడమ్ సైతం అదే చేసేశారు. లోక్‌సభ స్పీకర్‌గా హస్తం మార్కు మనిషిగా సుదీర్ఘకాలం ఎరిగిన సారుదీ అదే దారి. చేతికి చెయ్యిచ్చేసి... పువ్వు చేపట్టారు.

మన తెలుగు నేతలు మాత్రం తక్కువా? చేతి గుర్తు పార్టీ నుంచి పువ్వు పక్షానికి మారడానికి...సైకిల్ దిగి, కారు ఎక్కడానికి... కారు దిగి, చెయ్యి చేపట్టడానికి... అణుమాత్రం సంకోచించలా. చలో అంతే.

గురజాడ చెప్పిన మాటను, చూపిన బాటను తోసిరాజని... స్వలాభానికే పెద్ద పీట వేసిన పెద్దలు వీరంతా. ఎక్కడ వున్నా...ఏం చేసినా... పదవి ప్రధానం. ఆదాయం ప్రథమం. అదీ ఇదీ కాకపోతే... అవినీతి కేసుల నుంచి బైట పడడానికో, జైలు పాలు కాకుండా కాపాడుకోడానికో ... జపం చేయడానికైనా...జంప్ చేయడానికైనా రెడీ. కాకపోతే దానికి 'ప్రజాసేవ' అని ముద్దుపేరు పెడతారు.

మరి మీరు రెడీనా? ఇలాంటి వారిని కుర్చీ ఎక్కనీకుండా అడ్డుకోడానికి? గురజాడ చూపిన బాటలో నడవడానికి?

✧



టపా

ఆలోచింపచేసింది

28.9.14 'స్నేహ'లో వచ్చిన మనలోమాట 'పులుల మధ్య...' ఎంతో విశ్లేషణాత్మకంగానూ, లోతుగా ఆలోచించేలా ఉంది. అలాగే ఫేస్‌బుక్ వాడకం ఎంత ప్రమాదకరమైనదో చెప్పినందుకు ధన్యవాదాలు. మిగతా రచనలన్నీ కూడా చాలా బాగున్నాయి.

టి.ఎస్.ఎ కృష్ణమూర్తి, మదనపల్లె, చిత్తూరుజిల్లా.

పెట్టుబడులే ప్రధానం

నరేంద్రమోడీ అమెరికా పర్యటన కేవలం వాణిజ్యం కోసమేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కదా! మొన్నటివరకూ అమెరికా నరేంద్రమోడీని తీవ్రంగా వ్యతిరేకించింది... వెలివేసింది. ఇప్పుడు భారతదేశాన్ని తన గుప్పెట్లో వుంచుకోవాలనే మోడీకి ఎర్ర తివాచీ పరిచింది. ముఖ్యంగా మన దేశానికి పరిశ్రమలు, పెట్టుబడులు అవసరం. బిజెపి దాని అనుబంధ సంస్థలు చైనాను వ్యతిరేకిస్తున్నందున అమెరికాను ఆశ్రయిస్తున్నాయి. అయితే మోడీ అమెరికా ఐదు రోజుల పర్యటన ఎందుకోసమో ప్రకటించలేదు. దీని వెనుక అంతర్జాతీయ రాజకీయాలు దాగున్నాయన్నది వాస్తవం.

టి. శ్రీరామమూర్తి, విశాఖ.

హర్షణీయం

ఈ వారంలో వచ్చిన 'బుల్లి తెరపై విరిసిన పద్మం' ఆకట్టుకుంది. పద్మిని ప్రకాష్ న్యూస్ చదివే తీరు చూస్తే మాత్రం ఎవరైనా అలా ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోవాల్సిందే. అందమే కాదు.. ఆమె ప్రత్యేకం న్యూస్ చదివేతీరు కూడా తనను ప్రేక్షకులకు బాగా దగ్గర చేస్తుంది. థార్డ్‌జెండర్‌గా ఉన్న పద్మిని ప్రకాష్ సమాజంలో ఎన్నో అవమానాలనెదుర్కొంది. ఆ అవమానాలకు కుంగిపోకుండా సమాజంలోని గుర్తింపు కోసం ఎప్పుడూ కృషి చేస్తూనే ఉంది. మనం కూడా నిత్యం అలాంటివాళ్లని చూస్తూనే ఉంటాం. కానీ ఎందుకో తెలియదు గానీ వారిని చూడగానే వెంటనే అసహ్యించుకుంటాం. అది తరతరాలుగా వారికి జరుగుతున్న అన్యాయమే. కానీ సుప్రీంకోర్టు తీర్పుతో వారికి కొంత ఊరటనిచ్చింది. కనీసం ఇప్పటికైనా సమాజంలో వారికంటూ ఓ గుర్తింపు లభించినందుకు సంతోషంగానూ ఉంది.

రమణ, గుంటూరు.

ఆదర్శం

ఈ వారం స్నేహలో వచ్చిన ముఖచిత్రం, బుల్లితెరపై వికసించిన పద్మినివి ఆకట్టుకున్నాయి. న్యూస్‌రీడర్‌గా థార్డ్‌జెండర్‌కు చెందిన పద్మిని ప్రకాష్‌కి ఓర్పు, పట్టుదల, చిత్తశుద్ధితోనే తను అనుకున్నది సాధించగలిగింది. పద్మిని ప్రకాష్ అందరికీ ఆదర్శం. ఇక కవర్‌స్టోరీ సిరుల సింగపూర్, ఆటలతో అభివృద్ధి, చేగువేరా వర్ధంతి సందర్భంగా ఇచ్చిన ఐటమ్స్ అన్నీ బాగున్నాయి. అలాగే గురుదక్షిణ కథలో మూగమ్మాయికి చిన్నతనంలో సహకరించిన మాష్టారుని చూస్తుంటే అందరూ కూడా తమ అధికారంతోపాటు, మానవత్వాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటే బీద, అనాథలకు, అంగ వికలాంగులకు ఎంతో మేలు జరుగుతుందని తెలియజేస్తుంది.

కన్నెగండ్ల మారుతీ లక్ష్మణప్రసాద్, నర్సరావుపేట, గుంటూరు.

ఈ సంచికలో....

'బాల' యోధులు

కవర్‌స్టోరీ ———— 14

నేను బురఖా ఎందుకు వేసుకోవాలి? నేను చదువుకుంటే ఏమవుతుంది? నేను బురఖా లేకుండా స్కూలుకెళ్తే ఏమవుతుంది? అని నిలదీసిన సాహస బాలిక మలాలా యూసఫ్‌జాయ్. వాటికి బదులు ఇవ్వలేని తాలిబన్లు ఆమెమీద బుల్లెట్లు కురిపించారు. సంకల్ప బలం ముందు తూటాలెంత? మరింత శక్తిని కూడదీసుకుని ... కేవలం స్వదేశంలోనే కాకుండా... ప్రపంచంలోని ఆడపిల్లలందరి చదువుకోసం పోరాటం సాగిస్తోందా చిన్నారి.

విజ్ఞానంతో వికసించాల్సిన బాల్యం వెట్టి చాకిరిలో మగ్గిపోవడాన్ని సహించలేకపోయాడు కైలాశ్ సత్యార్థి. 'బచపన్ బచావో అందోళన్'ను ప్రారంభించి వేలాదిమందిని వెట్టి నుంచి విముక్తులను చేశాడు. చిన్నారుల హక్కుల కోసం పోరాడుతున్న ఈ బాల యోధుల కృషికి.... అత్యంత ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించిన సందర్భంగా...ఈ వారం అట్టమీది కథ.

ప్రత్యేకం	4
చీరల లైబ్రరీ	
పురుగుల ప్రపంచం	5
సమ్‌థింగ్ స్పెషల్	6
విడాకుల కోసం శతకోటి పాట్లు!	
వింతలోకం	8
ఐ ఫోన్ ఇస్తే... ఇల్లు రాసిస్తా	
నవ్వుల్-పువ్వుల్	9
కథ	10
మనిషి ఆశాజీవి	
చూద్దామా	12
అందాల దీవి అట్లాంటిస్	
సీరియల్	18
ప్రేమ- విప్లవం	
కొత్త పుస్తకాలు	21
'మౌనవేదన' అక్షరమైంది	
బాల నేస్తాలు	22
నందు తుమ్ము	24

రుచి ———— 7
దీపావళి స్పెషల్స్



తురగా జానకీ రాణి ఎవరో తెలియకుండా ఆమెతో ఫోన్‌లో మాట్లాడితే తనకు ఎనభై ఏళ్ల పైన వున్నాయని గాని, రెండు మూడు తరాల కిందటి మనిషని గాని అనుకోరు. ఆమె కంఠస్వరం, ఉచ్ఛారణ, ఇంగ్లీషు ప్రయోగం, అన్నిటినీ మించి తాజా విషయ పరిజ్ఞానం, ఆధునిక భావజాలం తొణకిసలాడుతుంటాయి. ఎప్పుడో తన 15వ ఏట 'కృష్ణాపత్రిక'లో మొదటి రచన చేసిన జానకీరాణి రేడియోలో కీలక బాధ్యతలు నిర్వహించి ఇప్పటి టీవీ యుగం వరకూ నిత్యనూతనంగా సజీవ చైతన్యంగా జీవితం గడిపారు. ఎన్నో బాధ్యతలు, రచనలు, బిరుదులు అవగాహన వున్నా తనదైన ప్రపంచానికి పరిమితమై సంస్కారవంతమైన జీవితం గడిపారు. గడచిన తరాల మహిళల శక్తియుక్తులకూ అభివృద్ధి కాంక్షకు ఆమె ఒక ప్రతీక. ఆమెతో గాని ఆమె కంఠంతో గాని రచనలతో గాని పరిచయం వున్నవారంతా ఈ సమయంలో ఇలాగే ఆమెను మననం చేసుకుంటారు. వారి కుటుంబానికి సన్నిహితులే గాక ఆకాశవాణితోనూ అనుబంధం వున్న మిత్రులు బండారు శ్రీనివాసరావు ఈసమయంలో అక్షరాలా ఇలాటి వ్యాఖ్యలే చేయడం యాదృచ్ఛికం కాదు.

ఆధునిక చైతన్యమూర్తి జానకీ రాణి

1936లో కృష్ణాజిల్లాలో పుట్టిన జానకీ రాణి ఇంటిపేరు మంటపాక. అయితే రచయిత, రేడియో ప్రయోక్త తురగా కృష్ణమోహనరావును పెళ్లి చేసుకున్నాక అదే ఇంటిపేరుతో పరిచితమైనారు. ప్రసిద్ధ రచయిత గుడిపాటి వెంకటచలం మనవరాలు వరుసయ్యే జానకి రాణి .... చాలా ఆలస్యంగా ప్రచురించిన తాతయ్య ఉత్తరాలులో ఎన్నో ప్రస్తావనలు వుంటాయి. ఎకనామిక్స్‌లో పి.జి. చేసిన జానకీ రాణి చాలా కాలం సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేశారు. 1960వ దశకంలో బాగా పేరున్న రచయిత్రుల్లో ఆమె ఒకరు. ఎంతో నిశిత పరిశీలన సహజ శైలి మనస్తత్వ ఘర్షణా చిత్రణ ఆమె కథలకు ప్రత్యేకత తెచ్చిపెట్టాయి. వాస్తవానికి ఇప్పుడు స్త్రీవాదం గురించి చెప్పడం కన్నా ఆ రోజుల్లో స్త్రీల కనీస హక్కులు అభ్యున్నతి కోసం గొంతు వినిపించడం ఎంతో గొప్ప విషయం. జానకీ రాణి ఆ పని జయప్రదంగా చేశారు. రాసిన వంద కథల్లో అధికభాగం మహిళల మనోభావాలనూ భౌతిక సమస్యలనూ అసమాన వ్యవస్థ ప్రభావాలను చిత్రించినవే. సత్యవతి ఆ కథల్లో ముఖ్యమైన వాటిపై చక్కటి పరిచయం రాశారు.

'గళంలో గరళం' అనే కథలో సరళ చిన్న వయస్సులోనే ఇంటర్మీడియట్ చదువుతుంటుంది. ఒక రోజు రైలు ప్రయాణం చేస్తుంటే ఆ పెట్టెలో మరో ఇద్దరు మహిళలు ఎక్కి మాటల్లో మునిగిపోతారు. తను చదువుకున్నాననే విషయం వారికి చెప్పాలని ఆమె తాపత్రయం కాని పట్టించుకోకుండానే దిగిపోతుంటారు. అప్పుడామె గట్టిగా అరచి చెబుదామనుకుంటుంది. 'భూతద్దం' కథలో ఒక మహిళ రాత్రి రిక్షాలో రావలసి వస్తుంది. అతను తన నగలు నగదు తీసుకుపోతాడేమోనని పరిపరివిధాల భయపడుతుంది గాని అతను సురక్షితంగా తీసుకువెళ్లి ఇంట్లో దిగబెడతాడు. అతనికి మాట్లాడుకున్నదానికన్నా ఒక రూపాయి కిరాయి అదనంగా ఇస్తే నేనేం ఉపకారంచేశానని ఆశ్చర్యపోతాడు. ఎలాంటి అపకారం చేయ నందుకు ఆమె తనలో తాను అను కుంటుంది! ఆవలికోణం, స్వయం కృతం కథల్లో చదువుకున్న భర్త లేని, ఉద్యోగాలు లేని మహిళలు ఇతరులను అదృష్ట వంతులనుకుంటారు గాని తర్వాత సాధక బాదకాలు తెలిసి అన్నీ ఒకటేనని తెలుసు కుంటారు. నవ్వనిపువ్వు కథలో నృత్యకళాకారిణిని ఇష్టపడి ఒప్పించి చేసుకున్న భర్త ఆమె తర్వాత ప్రదర్శనలే ఇవ్వకూడదని ఆంక్షలు పెడతాడు. ప్రత్యేకించి ఒక సందర్భంలో చేయవలసి వచ్చినందుకు రాద్ధాంతం చేస్తాడు. ఇలా ఆమె కథలన్నిటా మహిళల మనోవేదనలు జీవన ఘర్షణలు దర్శనమిస్తాయి. ఈ కథలు సాహిత్యాభిమానులను ఆకర్షించడమే గాక రావిశాస్త్రి కూడా ఒకసారి అభినందన లేఖ రాశారు. 'సుమిత్ర' కథ మరో కోవకు చెందింది. 22 ఏళ్ల సుమిత్ర వూరికి వెళ్లినప్పుడు ఆమెకన్నా చిన్నవాడైన యువకుడు అడిగితే పూలు తెచ్చి ఇచ్చి వూరికే వెళ్లిపోకుండా ఆమె పాదాలు ముద్దు పెట్టుకుంటాడు. పెళ్లయిన తర్వాత కొంతకాలానికి ఈ సంగతి భర్తకు చెప్పి అన్ని తేడాలు అంత దూరం వున్నా అతనలా ఎందుకు చేశాడని అడిగితే నీవు స్త్రీవి అతను పురుషుడు అని తేలిగ్గా తీసిపారేస్తాడు. అలాగే 'పవిత్ర' అనే నాటకంలో ఆమె స్త్రీ పవిత్రతత గురించి సమాజంలో వున్న అనేక భావాల అశాస్త్రీయతను అవాస్తవికతను కళ్లకు కట్టిచూపిస్తారు.

జానకీ రాణి భర్త కృష్ణమోహన్ 1974లో రోడ్డు ప్రమాదంలో మరణించడం ఆమెకు విషాదం తెచ్చిపెట్టింది. భర్త జ్ఞాపకాలను కూడా తనదైన శైలిలో అక్షరబద్ధం చేసి సమర్పించారు. ఉదాహరణకు ఆయన ఆ చనిపోయిన రోజు ఇంటిదగ్గర బయిలుదేరే ముందు ఏదైనా చేసి ఇస్తానంటే వద్దు ఏదో గడ్డి తింటాలే అన్నాడట. పోస్టు మార్టంలో గడ్డి వుందని ఆమె విచారంగా రాస్తారు. ఈ రాయడం కూడా చాలా ఉద్వేగంతో- చలం జీవితం రచనలలో వైరుధ్యాలు సంక్లిష్టతలు, విడ్డూర ధోరణలు తెలిసిన జానకీ రాణి ఆయనను గౌరవిస్తూనే వాటిని అర్థం చేసుకోవడానికి వీలైన రీతిలో లేఖలు పునర్ముద్రించారు. వాస్తవికత లోపించిన ఆయన జీవన దృక్పథంపై నిశిత వ్యాఖ్యలు అప్పట్లో చేయడమే గాక ఈ పుస్తకంలోనూ క్రోడీకరించారు. తనలాగే మనవరాలు కూడా రాస్తుందనేదానిపై చలం సంతోషం, రచయితల ఉమ్మడి ఘోషలాగా చెప్పు కున్న కొన్ని మాటలు చాలా బావుంటాయి. వారి ప్రేమ గురించి పెళ్లి తదనంతర అంశాల గురించి చలం వ్యాఖ్యలు కనిపిస్తాయి. (వీటిని ఈ మధ్యనే ప్రజాశక్తి స్ఫూర్తి శీర్షికన సంక్షిప్తంగా ప్రచురించింది) భర్త మరణానంతరం ఆమెకు ఆకాశవాణిలో ఆయన స్థానే పోస్టింగు ఇచ్చారు. ప్రోగ్రామర్‌గా చేరిన జానకీ రాణి అంతకు ముందు న్యాపతి కామేశ్వరి నిర్వహించిన బాలానందంలో రేడియో అక్కయ్య యాంకరింగ్‌లో బాగా పేరు తెచ్చుకున్నారు. ఎందరో బాలబాలికలలో సృజన శక్తిని పెంపొందించారు. రచన ఉపన్యాసం ఏక పాత్రాభినయం వంటి విద్యలు పెంపొం దించారు. రేడియోలో ఆమె దేవులపల్లి కృష్ణశాస్త్రి, త్రిపురనేని గోపీచంద్ వంటివారి దగ్గర పనిచేయడం విశేషం. అక్షరాస్యత, బాలల చదువు, స్త్రీ విద్య, వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాలు రూపొందించి పలు అవార్డులు అందుకున్నారు. ఇటీవలనే తన వంద కథలనూ ఒకే సంపుటంగా విడుదల చేశారు. అయిదారేళ్ల కిందట హారీ పాటర్‌పై టీవీ9లో ఆమెతో కలసి చర్చలో పాల్గొన్న సందర్భంలో చాలా విషయాలు తెలుసుకోగలిగాను. అప్పుడే తన పుస్తకాల ఇచ్చి అభిప్రాయం తప్పక చెప్పాలన్నారు. ఈ మధ్య మరోసారి ఫోన్ చేసినపుడు 'మనం కలుసుకున్న తర్వాత మీరు టీవీలో మరింత విస్తృతంగా కనిపిస్తున్నారంటూ అభినందించారు. చలంపై తన రచన భాగాలు వేస్తున్న సంగతి చెప్పి త్వరలో కలుసుకుందామని చెప్పాను. ఇంతలోనే ఆమె మరణించడం విచారం కలిగించింది. ఇప్పుడు స్త్రీల అభద్రతతో సహా అనేక సమస్యలున్నా ఈ మాత్రం సామాజిక స్థానం లభించిందంటే అందుకు జానకీ రాణి వంటి వారెందరో నిర్వహించిన పాత్ర వుందని గుర్తుంచుకోవాలి. అవకాశాలు, తక్కువ ఆంక్షలు అత్యధికంగా వున్న ఆ రోజుల్లోనే వారు అంతగా అభివృద్ధి సాధించిన తీరు అనుసరణీయం కావాలి. తన కవితలకు చేతకాని నటి అని పేరు పెట్టుకున్న జానకీ రాణి చాలా విద్యలు చేతనైన విదుషీమణి. ఆ మాతృమూర్తికిదే కళాంజలి.

- తె.ర

◆ ప్రత్యేకం

పుస్తకాల లైబ్రరీ తెలుసు. బొమ్మల లైబ్రరీ తెలుసు. కొత్తగా ఈ చీరల లైబ్రరీ ఏంటి? అనుకుంటున్నారా? నిజంగానే వుందండీ. కాకపోతే అహ్మదాబాద్‌లో. ఖరీదైన చీరలు, రకరకాల చీరలు ఇక్కడ అందుబాటులో వుంటాయి. కావాల్సిన వాళ్లు ఎంచక్కా తెచ్చుకోవచ్చు.అద్దెకే అనుకోండి. ఆ వివరాలేంటో చూద్దాం.

చీరల లైబ్రరీ

బీరువాల్లో ఏడాదికి ఒకసారి కూడా వాడని చీరలు వుండే వుంటాయి. ఇక పట్టు చీరల సంగతి చెప్పేదేముంది? ఎప్పటికప్పుడు కొత్తవి కొనుక్కునే వారి సంగతి పక్కన పెడితే... పెళ్లిళ్ల, పండగలు, పబ్బాలకు మాత్రమే వాటిని వాడేవారు అధికం. ఇక మామూలు చీరల్లో కూడా ఖరీదైన వాటిని అరుదుగా మాత్రమే వాడుతుంటారు కొందరు. ట్రెండీగా లేవని, ఔట్ ఆఫ్ ఫ్యాషన్ అని... కొన్ని చీరలను పక్కన పెట్టేస్తుంటారు. పైసలున్నవారు ఎన్ని షోకులైనా పోతారు. కోరుకున్న చీరలు కొనుక్కుంటారు. మరి చేతిలో రూకలు లేనివాళ్ల సంగతేంటి? ఎక్కడైనా పెళ్లి జరుగుతున్నా, పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నా... కాస్తంత ఖరీదైన...అందమైన చీరలు కట్టుకోవాలని ఉబలాట పడుతుండేది. అహ్మదాబాద్‌కు చెందిన పింకీ మక్వానా తనకు ఊహ తెలిసిన దగ్గర నుంచి .. ఉత్సవాలకు...తొమ్మిది గజాల పటోలా చీర కట్టుకోవాలనుకునేది. కానీ ఇంటి పరిస్థితులు అందుకు అనుకూలించేవి కావు. రాణిప్ పరిస్థితీ అంతే. ఆమె బడ్జెట్‌కి... పటోలా చీర కొనుక్కోవడం అసాధ్యం. ఎందుకంటే వాటి ధర కూడా అలాగే వుంటుంది మరి. ఐదు వేల రూపాయల నుంచి ఆ పైన ... ఆకాశమే హద్దు. ఇలాంటి వారికోసమే అన్నట్టు .... అహ్మదాబాద్‌కు చెందిన వందన అగర్వాల్... ఓ చీరల లైబ్రరీని ప్రారంభించింది. ఈమె గ్రామ్‌శ్రీ అనే స్వచ్ఛంద సంస్థలో పని చేస్తుంది. తన చుట్టూ వున్న మహిళల మాటల్లో వారి కోరికలు తెలుస్తుండేవి. తనకు తెల్సిన అనేక మంది ఇళ్లల్లో ... వాడకుండా పడేసిన చీరలెన్నో వుండేవి. ఈ రెంటినీ కలిపితే... అన్న ఆలోచనకు రూపమే చీరల లైబ్రరీ. నిరుపయోగంగా పడివున్న వారి నుంచి 200 చీరలను సేకరించి ఈ లైబ్రరీని ప్రారంభించింది. గుజరాతీ పటోలాలు, కంజీవరం చీరలు, ఇతర పట్టు చీరలు మొదలుకొని అనేక రకాలున్నాయి. వెయ్యి రూపాయల నుంచి పది వేల రూపాయల వరకు వీటి ధర వుంటుంది. కావాల్సినవారు అక్కడికొచ్చి మనసుకు నచ్చిన వాటిని ఎంపిక చేసుకుని తీసుకెళ్లొచ్చు. కాకపోతే వాటికి అద్దె కట్టాలి. పైగా ఆ చీరకు గ్యారెంటీగా ఒకరు సంతకం చేయాల్సి వుంటుంది. అప్పుడు వారం రోజులపాటు ఆ చీర వారి దగ్గరే వుంటుంది. ఇళ్లల్లో జరిగే చిన్న చిన్న కార్యాలకు వాటిని వాడుకోవచ్చు. ప్రస్తుతానికి అహ్మదాబాద్‌లో రెండు చోట్ల ఈ చీరల లైబ్రరీలున్నాయి. రెండూ వందనవే. ఒకటి రణీప్ ప్రాంతంలోను, మరొకటి చంద్లోడియలోను వున్నాయి.

'మా దగ్గరకు వచ్చి చీరలు తీసుకెళ్లే వారంతా అంతంత మాత్రపు ఆదాయం వున్నవారు. పెళ్లిళ్ల, ఫంక్షన్లకు కట్టుకోవడానికి అవసరమైన చీరలను కొనుక్కోలేనివారు. వారికి ఉపయోగకరంగా వుండాలనే దీన్ని ఏర్పాటు చేశాం' అంటుంది వందన. ఈ లైబ్రరీకి అనేక మంది చీరలు దానం చేశారు. హేటల్ పటేల్ వారిలో ఒకరు. 'నా బీరువాలో అస్సలు వాడని ఖరీదైన చీరలు చాలా వుండేవి. వాటి వల్ల ఇతరులకు సంతోషం కలుగుతుందంటే... ఎలా కాదనగలను?!' అంటారామె. ఇప్పుడు అహ్మదాబాద్‌లో చీరల లైబ్రరీ గురించి తెలియని మహిళలు లేరేమో!

✡

పురుగుల ప్రపంచం

'పురుగులకూ ఒక ప్రపంచమా? అనిపిస్తోందా? ఏం! చెట్లకూ, జంతువులకూ, పక్షులకూ, మనుషులకేనా ప్రపంచాలుండేది? పురుగులకు వుండకూడదేమిటి? వాటి ప్రపంచం వాటికుంది. కొంచెం తొంగి చూడాలేగానీ మనం 'వామ్మో' అనేంత చిత్రవిచిత్ర ప్రపంచం వాటిది.

పురుగుల ప్రపంచం అనగానే మనకు దోమలు, ఈగలు, పేలు, చిమటలు, గోమార్లు లాంటివి ...నిత్యం కన్పించేవి... మనల్ని చంపుకుతినేవి గుర్తుకొస్తాయి. కాదంటే పచ్చ దోమలు, తెల్ల దోమలు, లద్దె పురుగులు, పేను పురుగులు, కాయ పురుగులు, వేరు పురుగులు, ముక్కు పురుగులు లాంటివి మన పంటల్ని నాశనం చేసేవైనా గుర్తుకొస్తాయి. వీటన్నింటినీ మనం శత్రువులుగా లెక్కిస్తున్నాం. వీటిని చంపడానికి నానా తంటాలు పడుతున్నాం. మరి పురుగులన్నీ శత్రువులేనా? అసలీ పురుగులే లేవనుకోండి... అపుడేమవుతుంది? ఏమవుతుందా? తేనెటీగలూ, సీతకోకచిలకలూ లేకుంటే పరపరాగ సంపర్కమే జరగదు. కాయలుండవు, పండ్లుండవు, విత్తనాలుండవు, అసలు చెట్లే వుండవు! చెట్లే లేకుంటే మనకు తిండి లేదు. ఇల్లు లేదు. ఇంకా చాలా చాలా లేవు. అంతేనా? మన పట్టుగుడ్డలు ఎక్కడివి? రంగులు ఎక్కడివి? మందులు ఎక్కడివి? లక్క ఎక్కడిది? ఇవన్నీ పురుగుల నుంచి ఉత్పత్తి అవుతున్నవే. కాబట్టి పురుగుల్ని 'పురుగుల్లా' తీసిపారెయ్యకూడదు. ఆ వివరాలేంటో చూద్దాం.

ఎన్ని ప్రత్యేకతలో!

మనం మనుషులం. ఈ భూమ్మీద ప్రాణులు పుట్టి 5–6 లక్షల సంవత్సరాలైంది. మరి పురుగులు సుమారు 25 కోట్ల సంవత్సరాల నాడే పుట్టాయి. దీన్నిబట్టి చూడండి భూమికి పురుగులు మనకంటే ఎంత పెద్దబిడ్డలో! డార్విన్‌ను గురించి మనకు తెలుసు. ఈ భూమ్మీద ప్రాణులు ఎలా పుట్టి, పెరిగి, ఎన్ని రకాలుగా పరిణామం చెందాయో ఆయన అద్భుతంగా చెప్పారు. మరాయనకు ఆ శాస్త్రీయ అవగాహన ఎలా కల్గిందంటారు. ఈ పురుగుల పరిశీలన నుంచే కలిగింది. ఇలా క్రిమి కీటకాలు శాస్త్రజ్ఞానాన్ని మనకు అందించాయని మరచిపోకూడదు. పురుగులు పరిణామ క్రమంలో ప్రత్యేకమైన మలుపులో భూమి మీదకొచ్చాయి. అందువల్ల వీటి ఆకారం, అలవాట్లు ప్రత్యేకంగా ఉంటాయి. విచిత్రంగా ఉంటాయి. శరీరానికి బాహ్య కవచం ఒక ప్రత్యేకత అయితే, తల, వీపు, ఉదరం (కడుపు) అనే భాగాలుగా వీటి శరీరం ఉంటుంది. మూడు జతల కాళ్లు, రెండు జతల రెక్కలు మరో ప్రత్యేకత! తిరగబడి నిర్మించబడ్డ నాడీ మండలం ఇంకో ప్రత్యేకత! తలభాగంలో ప్రత్యేక అవయవాలుగా రూపొందిన స్పర్శ వెంట్రుకల (Antennae) జత కూడా వీటికి తప్ప ఏ ప్రాణులకూ ఉండవు. కీళ్ల చివర్లలో పునరుత్పత్తి భాగాల కొసలమీద రంగు, రుచి, వాసన వంటి జ్ఞానాల్ని కల్గించే చిన్న అవయవాలు కూడా వాటికి ప్రత్యేకం. అన్నింటిని మించి పరికరాలకు తగ్గట్టు, తమ మనుగడకు అవసరమైనట్టు శారీరక మార్పుల్ని పొందగల శక్తి వీటికే ఉంది!

అసలు రహస్యం

పై కవచాన్ని చాలా పురుగులు అవసరమైనప్పుడు తిరిగి నిర్మించుకోగలవు. పెరిగే శరీరాన్ని ఇముడ్చుకోగల శరీర నిర్మాణం చాలా పురుగుల ప్రత్యేకత. మారే వాతావరణాల్ని, పరిస్థితుల్ని తట్టుకొనేందుకు ఇవి రూపాల్ని మార్చుకోగలవు. సైజు తగ్గించుకోగలవు. పెంచుకోగలవు. తినే ఆహారాన్నిబట్టి వాటి భాగాల నిర్మాణం ఈ పురుగులకు ఉంటుంది. కాళ్ల పొందిక, రెక్కల మార్పులు, శరీరంపై పెరిగే వెంట్రుకలు పురుగులకు మరీ ప్రత్యేకం. చాలా పురుగులు శరీరపు రంగును కూడా పరిసరాలకు అనుగుణంగా మార్చేసుకుంటాయి. కొన్నిటికి రక్షణ కోసం మైనం (wax), కొన్నిటికి రబ్బరు పొర (Rasin) కొన్నిటికి శత్రువుల్ని బెదిరించి గాయపరచగల ద్రవాలూరించే గ్రంథులు ఉంటాయి. శత్రువును ఎదుర్కో వడానికి కొన్నిటికి ముళ్లు ఉంటాయి. ఇంతేనా? పరిగెత్తడం, దూకడం, ఎగరడం, ఈదడం, చచ్చినట్లు కదలడం మానేసి పడి వుండడం, నక్కడం లాంటి వంటారా? వీటికి వెన్నతో పెట్టిన విద్య. దారాలు అల్లుకోవడం, గూళ్లు నిర్మించుకోవడం లాంటివి రక్షణ కోసం కొన్ని పురుగులు చేసుకోగలవు. ఇవన్నీ ఉండబట్టే ఇవి ఇంతకాలం బతికి బట్టకట్టగలిగాయి!

మరి ఆహారమో?

ఆహారం సంపాదించుకోవడంలో పురుగులకు వున్నంత సామర్థ్యం దేనికీ ఉండదు. చెట్ల విభాగాలను తిని బతికే పురుగులున్నాయి. జంతు రక్తాల్ని, కుళ్లిన పదార్థాల్ని ఆశ్రయించడమే కాదు ఇతర పురుగుల మీద కూడా ఇవి బతికేయగలవు. ఈ పని మనుషులెక్కడ చెయ్యగలరు? కావాలంటే ఇవి అతిగా తింటాయి. ఆహారం దొరక్కపోతే, కొన్ని జీవిత దశల్లో తిండిమాని బతుకుతాయి. అన్నిటికంటే గొప్ప సంగతి, తల్లీ బిడ్డల మధ్య ఆహారం సంపాదనలో పురుగుల్లో పోటీ ఉండదు. ఒక్కో జాతి పురుగు, ఆహారం అవసరాలు ఒక్కో రకంగా ఉంటాయి. పురుగులు చాలా విచిత్ర జీవులు. దేని సైజు దానిదే. ఒకదానికి మరోదానికి పొంతనే ఉండదు. పొలుసు రెక్కల పురుగు (అట్లాస్ మాల్ ఆఫ్ ఇండియా) దాదాపు ఒక అడుగు (30 సె.మీ) ఉంటుంది. గొల్లభామలు 34–37 సె.మీ.లవి కూడా ఉంటాయి. ఆఫ్రికా జాతి పెంకు పురుగుల్లో కొన్ని భూమ్మీద దిగాయంటే విమానం దిగినంత శబ్దం పుడుతుంది. మన గుండెలు గుభేలుమంటాయి. మిడతలదండు పైన వెళుతుంటే నేలమీద పడే నీడకు జనం పరిగెత్తి పోతారు. కానీ పొలుసు రెక్క పురుగు సైజు ఎంతో తెలుసా? అంగుళంలో పదోవంతు కూడా ఉండదు.

✡

◆ సమ్‌థింగ్ స్పెషల్

ప్రపంచంలో జనం కూటి కోసం కోటి పాట్లు పడుతున్నారు. ఫిలిప్పైన్స్‌లో మాత్రం కూటితో పాటు విడాకులు కోసం శతకోటి పాట్లు పడుతున్నారంటే నమ్ముతారా? తప్పదు మరి. భువిపై విడాకులపై నిషేధం అమలు జరుపుతున్న దేశాలు రెండే ఉన్నాయి. ఒకటి ఆసియాలోని ఫిలిప్పైన్స్, రెండవది ఇటలీలోని వాటికన్ సిటీ. సాంకేతికంగా వాటికన్ సిటీ ఒక దేశంగా పరిగణించబడుతున్నా అది క్రైస్తవ మత కేంద్రం. అందువలన సంపూర్ణ దేశంగా ఉన్నది మాత్రం ఒక్కటే.

విడాకుల కోసం శతకోటి పాట్లు!

ఇష్టం లేకపోతే విడాకులు తీసుకోవటం ప్రపంచవ్యాపితంగా ఉంది. విడాకుల కోసం ఇంగ్లండ్ రాజు హెన్రీ కాథలిక్ చర్చ్‌ను వదలి పెట్టి ఏకంగా ఇంగ్లండ్ చర్చ్‌ను ఏర్పాటు చేశాడు. ఛాందసాన్ని బద్దలు కొట్టాడు. అందువలన అది మన సాంప్రదాయం కాదని ఎవరైనా చెబితే కొత్త దారులు వెతుక్కుంటారు తప్ప బలవంతంగా కాపురం చేయలేరు. వివాహ బంధం లేకపోయినా స్త్రీ పురుషులు కలిసి ఉండగలరు గాని ఇష్టం లేకపోతే పవిత్రంగా భావించే బంధంలో ఒక్కటైనా ఒక్క క్షణం కూడా ఉండలేరన్నది తిరుగులేని సత్యం. అయితే వివాహం చేసుకోకపోతే జీవితాలను నాశనం చేసుకోవటం తెలుసుగాని విడాకులు రాని కారణంగా బలవన్మరణాలు సంభవించటం అరుదు. ఇష్టమైతే 60లో కూడా 20గా ఉంటారు, కష్టమైతే 80 వచ్చినా విడిపోయిన వారెందరో. లోక రీతికి భిన్నంగా జరిగేదే, అదే మనిషి కుక్కను కరిస్తే వార్త అన్నట్లుగా జీవితాంతం కలిసి ఉన్న ప్రముఖుల కంటే విడిపోయిన వారికే మీడియాలో పబ్లిసిటీ ఎక్కువ.

రష్యా అధ్యక్షుడిగా ఉన్న వ్లదిమిర్ పుతిన్ తాజా ప్రముఖుడు. తమ 30వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్ దంపతులు తాము విడిపోతున్నట్లు టీవీలో ప్రకటించి సంచలనం సృష్టించారు. గతంలో ఇలాగే విడిపోయిన చివరి రష్యన్ పాలకుడు పీటర్ ద గ్రేట్. పదిహేడవ శతాబ్ది చివరిలో తన భార్యకు విడాకులు ప్రకటించాడు. న్యూయార్క్ గవర్నర్‌గా ఉన్న రాక్‌ఫెల్లర్ 31 సంవత్సరాల తరువాత భార్యకు విడాకులిచ్చి తన కంటే 27 సంవత్సరాల చిన్న అయిన యువతిని వివాహం చేసుకున్నాడు. ఇక సినీతారలు ఎలిజబెత్ టేలర్, రిచర్డ్ బర్టన్‌లు రెండు సార్లు వివాహం చేసుకొని రెండు సార్లు విడాకులు తీసుకున్నారు. మీడియా మొఘల్‌గా పరిగణించబడే రూపర్ట్ మర్డోచ్ విడాకులు అత్యంత ఖరీదైనవి. మొదటి భార్యకు పదేళ్ల సంసారం తరువాత రెండో భార్యకు 31 ఏళ్ల తరువాత విడాకులు ఇచ్చాడు. రెండవసారి పది కోట్ల డాలర్ల నగదుతో పాటు మొత్తం 170 కోట్ల డాలర్ల ఆస్థిని భరణంగా చెల్లించాల్సి వచ్చింది. తరువాత 68 ఏళ్ల వయసులో తనకంటే 38 ఏళ్ల చిన్న యువతిని మూడో వివాహం చేసుకున్నాడు. పద్నాలుగు సంవత్సరాల తరువాత గతేడాది ఆమెకు కూడా విడాకులిచ్చాడు.

మరో సినీ ప్రముఖుడు మెల్ గిబ్సన్ 31 సంవత్సరాలు కాపురం చేసి ఏడుగురు పిల్లల్ని కన్న తరువాత భార్యకు విడాకులిచ్చాడు. అందుకు చెల్లించిన భరణం 25 కోట్ల పౌండ్లు. గాయకుడు పాల్ మెకార్థీ ముగ్గుర్ని వివాహం చేసుకొని భారీగా మూల్యం చెల్లించి విడాకులిచ్చాడు. గోల్ఫ్ క్రీడా కారుడు టైగర్ ఉడ్స్ అక్రమ సంబంధాలు బయట పడటంతో భార్యకు 50 కోట్ల డాలర్ల మేర పరిహారం చెల్లించి బయట పడ్డాడు. ప్రిన్స్ ఛార్లెస్–డయానా వివాహ బంధం విచ్ఛిన్నం గురించి తెలిసిందే.

చివరిగా పదహారవ శతాబ్దంలో ఇంగ్లండ్ రాజు ఎనిమిదవ హెన్రీ గురించి చెప్పుకోవాలి. స్పానిష్ రాని కాథరిన్ కూతురు తప్ప కుమారుడు కలగలేదని హెన్రీ విడాకులు కోరాడు. పోప్ అందుకు అంగీకరించలేదు. దాంతో కాథలిక్ చర్చిని బహిష్కరించి ఇంగ్లండ్ చర్చ్ ఏర్పాటు చేశాడు. మొత్తం ఆరుగుర్ని వివాహం చేసుకున్నాడు ఇద్దరికి విడాకులు, ఇద్దర్ని ఉరితీయించాడు.

ఇంతకీ ఇన్ని విషయాలు ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే ముందే చెప్పుకున్న ఫిలిప్పైన్స్‌లో విడాకులపై నిషేధం ఉన్నప్పటికీ జంటలను ఒక్కటిగా ఉంచలేకపోతున్నదని తాజా వార్తలు. మతంలో పరువుపోతేనేం డబ్బులు దండుకుంటే మేలు అనుకొనే విడాకుల లాయర్లు, న్యాయమూర్తుల పంట పండుతున్నది.వివాహం కంటే విడాకుల ఖర్చు తడిచి మోపెడవుతోంది. అక్కడి చట్టాలు కఠినంగా ఉండటంతో విడిపోయిన వారు విడాకులు తీసుకోకుండానే ఇతరులతో సంబంధాలు ఏర్పరుచుకొంటున్నారు. చిన్న చిన్న కారణాలతో అక్కడ విడాకులు ఇచ్చే సమస్యే లేదు.

విడాకుల కేసుల్లో న్యాయమూర్తులకు లంచాలు ఇవ్వటం సర్వసాధారణం. ఎందుకంటే త్వరగా కేసులు తేల్చి విడాకులు రావాలంటే తప్పదట. బలమైన కారణాలుగా వివాహ సమయంలోనే మానసికంగా సరిగా లేరనే కారణాలను ఎక్కువగా చూపుతున్నారని తేలింది. ఒక గ్రాఫిక్ డిజైనర్ 2004లోనే భార్యకు దూరమై మాట్లాడటం మానేశాడు. మూడు సంవత్సరాల క్రితం మరొక అమ్మాయిని వివాహం చేసుకొనేందుకు విడాకుల కోసం మన రూపాయల్లో రెండు లక్షల రూపాయలు చెల్లించి ఒక లాయర్‌ను కుదుర్చుకున్నాడు. అయితే అంతకు రెండు రెట్లు ఖర్చవుతుందని గ్రహించాడు. మరొక లాయర్‌ను కుదుర్చుకున్నాడు. తాను మానసికంగా సరిగా లేనని సర్టిఫికెట్ తీసుకొనేందుకు ఒక వైద్యుడిని ఆశ్రయించాడు. అతని భార్య కూడా అదే కారణాలతో సర్టిఫికెట్ తీసుకుంది. తీరా కేసు విచారణకు వచ్చిన తరువాత తన భార్య అప్పటికే విడాకులు తీసుకుందని తెలిసి చేతి చమురు వదలినందుకు హతాశుడయ్యాడు. మనవాడు విడాకులు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసినా తగిన శాస్తి జరగాలన్న కసితో లక్షల పెసోలు ఖర్చు చేయించాలని అప్పటికే విడాకులు తీసుకున్న విషయం దాచిపెట్టిందని తరువాత తేలింది. లక్షల కొద్దీ పెసోలు చెల్లించి విడాకులు తీసుకోవటం కంటే పది పదిహేను వేల పెసోలతో కిరాయిదార్లతో భార్యను హత్య చేయించి వదిలించుకోవటం చౌక అని అతగాడు చెబుతున్నాడు. ఇదీ బలవంతపు వివాహాలు ఇలాంటి నేరస్థ ఆలోచనలకు దారితీస్తాయి. పదికోట్ల మంది జనాభా ఉన్న ఫిలిప్పైన్స్‌లో గతేడాది కేవలం 10,257 కేసులు మాత్రమే కోర్టులకు వచ్చాయి. వాటిలో 95శాతం విడాకులు మంజూరయ్యాయి.

- సత్య

దీపావళి స్పెషల్స్

కాజాలు

కావలసిన పదార్థాలు : మైదా : 1/2 కేజీ, పంచదార: 1/2 కేజీ, బియ్యం పిండి : 2 టేబుల్ స్పూన్లు, నెయ్యి : 2 కప్పులు, నూనె : సరిపడినంత, ఉప్పు, చిటికెడు.

తయారుచేసే విధానం : మైదాపిండిలో ఒక కప్పు వేడినెయ్యి, చిటికెడు ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి కలపండి. కావలసిన సైజులు వుండలు చేసి చపాతీల్లా వత్తండి. ఒక చపాతీపై రెండు స్పూన్లు నెయ్యి వేసి రాయండి. దానిపై బియ్యం పిండి చల్లండి. పైన ఇంకో చపాతీ వేసి మళ్లీ నెయ్యి వేసి, బియ్యంపిండి చల్లండి. దాన్ని రోల్ చేసి కట్ చేయండి. అప్పడాల కర్రతో కాజాల్లా వత్తండి. పంచదార తీగపాకం పట్టి పక్కకు పెట్టుకోండి. బాణలిలో నూనె పోసి కాగిన తర్వాత కాజాలు వేసి బంగారు రంగులో వేయించి పాకంలో వేసి పదినిముషాలు వుంచి తీసేయండి. ఈవిధంగానే కాజాలన్నీ వేయించి పాకంలో వేయండి.



కజ్జికాయలు

కావలసిన పదార్థాలు : కొబ్బరికాయ: 1, పుట్నాలు : 1 గ్లాసు, బెల్లం పొడి: 1 గ్లాసు, పంచదార : 1 గ్లాసు, మైదా : 1/2 కేజీ, నూనె : సరిపడినంత. ఉప్పు : చిటికెడు, యాలకుల పొడి : 1 టీస్పూను, పచ్చి కోవా : 1 కప్పు.

తయారుచేసే విధానం : కొబ్బరికాయ కొట్టి చిన్నచిన్న ముక్కలు చేసి వేయించండి. చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయండి. పుట్నాలు మెత్తగా గ్రైండ్ చేయండి. వీటిలో బెల్లంపొడి, పంచదార, యాలకులపొడి, పచ్చికోవా వేసి బాగా కలపండి. మైదాలో కొంచెం వేడినూనె, చిటికెడు ఉప్పు, సరిపడినన్ని నీళ్లు పోసి పూరీపిండిలా కలపండి. చిన్నచిన్న ఉండలు వేసి పూరీలు వత్తి, దాని లోపల పుట్నాల పూర్ణం పెట్టి అంచులకు నీళ్లురాసి చుట్టండి. మూకుడులో నూనె పోసి కాగిన తర్వాత కజ్జికాయలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి.

చంద్రకాంతలు

కావలసిన పదార్థాలు: పెసరపప్పు : 1 కప్పు, బెల్లం పొడి : 1 కప్పు, బియ్యం : 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి : 1 టీ స్పూన్, కొబ్బరి కోరు : 2 కప్పులు, నెయ్యి, జీడిపప్పు: సరిపడినంత, ఉప్పు : చిటికెడు, నూనె : సరిపడినంత.

తయారు చేసే విధానం : బియ్యం పెసరపప్పు బాగా కడిగి మూడు గంటలు నానబెట్టండి. కొంచెం నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయండి. కాపర్‌బాటమ్ పాన్ తీసుకొని ఒక కప్పు నీళ్లు, బెల్లం పొడి వేసి ఉడికించండి. దాంట్లో కొబ్బరికోరు, ఒక స్పూన్ నెయ్యి, చిటికెడు ఉప్పు, పెసరపప్పు మిశ్రమం వేసి బాగా కలపండి. ఉండకట్టకుండా కలుపుతూ సన్నటి సెగపై ఉడికించండి. దగ్గరపడిన తర్వాత ప్లేటుకు నెయ్యి రాసి దాంట్లో ఈ మిశ్రమం వేయండి. జీడిపప్పులు నేతిలో వేయించి పైన అలంకరించి డైమండ్ షేపులో కట్ చేయండి. మూకుడులో నూనె పోసి కాగిన తర్వాత ఈ ముక్కలు వేసి సిమ్‌లో పెట్టి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి. వీటిని పేపర్‌పై వేస్తే అదనపు నూనెను పీల్చుకుంటుంది.

కాజు బర్ఫీ

కావలసిన పదార్థాలు : జీడిపప్పులు : 2 కప్పులు, పంచదార : 1 కప్పు, నెయ్యి : 1 కప్పు, యాలకుల పొడి : 1/2 టీ స్పూను, సిల్వర్ పేపర్.

తయారుచేసే విధానం : జీడిపప్పులను మూడు గంటలపాటు నానబెట్టి కొంచెం నీళ్లు పోసి పేస్ట్‌లా చేయండి. నాన్‌స్టిక్ పాన్‌లో పంచదార, ఒక కప్పు నీళ్లు పోసి సన్నటి మంటపై ఉడికించండి. తర్వాత జీడిపప్పు ముద్దను వేసి బాగా కలుపుతూ సన్నటి సెగపై ఉడికించండి. మిశ్రమం గట్టి పడుతుండగా నెయ్యి, యాలకులపొడి వేసి బాగా కలిపి మంట ఆర్పేయండి. ప్లేటుకు నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేసి సమానంగా పరచండి. పైన సిల్వర్ పేపర్ అద్ది కావలసిన షేప్‌లో కట్ చేసుకోండి.

అబద్ధాలు పసిగట్టే బొమ్మ

అబద్ధాలు ఆడని వారుంటారా! మన పిచ్చిగాని? ఏదో ఒక సందర్భంలో...ఏదో ఒక విషయంలో అబద్ధం చెప్తూనే వుంటాం. తప్పించుకోవడానికి కావొచ్చు, ఎందుకొచ్చిన గొడవ అని కావొచ్చు... కారణం ఏదైతేనేం! అవసరాన్ని బట్టి అబద్ధాలు చెప్పేస్తుంటాం. అయితే ఇక మీదట ఈ పప్పులేం ఉడకవండోయ్! మనం చెప్పేది అబద్ధం అయితే టక్కున పసిగట్టే బొమ్మ ఒకటి వచ్చేసింది. దీన్ని జపాన్‌వారు తయారుచేశారు. కేవలం తలకు పెట్టుకుంటే చాలు. ఎదుటి వారు అడిగిన ప్రశ్నలకు మన చెప్పిన సమాధానం నిజమైతే ... నుదుటి మీద ఆకుపచ్చ రంగు కనిపిస్తుంది. ఒక వేళ పసుపు రంగు కనిపిస్తే అబద్ధం చెప్పినట్టు. ఎరుపు కనిపిస్తే...ఇక అది పక్కా అబద్ధమని అర్థం. దీన్నే 'ది కొకొరో స్కానర్' అని పిలుస్తున్నారు. దీన్ని టోక్యోలోని బొమ్మల కంపెనీ 'టకరా టామీ' తయారుచేసింది. ఖరీదు యాభై డాలర్లు. కోర్టుల్లో, పోలీస్ స్టేషన్లలో సాక్ష్యాలుగా దీన్ని వాడలేకపోవచ్చు గానీ... ఉబుసుపోక ఆడుకునే ఆటల్లో మాత్రం నిరభ్యంతరంగా వాడుకోవచ్చుట.

బోల్టుల బొమ్మ

పనికిరాని చెత్తతో అద్భుతమైన బొమ్మలు చేయడం చూస్తూనే వుంటాం. ఇదిగో మీ ముందుకొచ్చిన భారీ బొమ్మ కూడా అలాంటిదే. ఇంతకీ ఈ బొమ్మ బ్రహ్మ ఎవరనుకుంటున్నారు? బేన్ హన్ లెక్ అనే ఆర్ట్ కంపెనీ. ఇది అచ్చంగా చెత్తతోనే చిత్రాలు తయారుచేస్తుందిలెండి. మీ ముందున్న హల్క్, సూపర్‌మేన్ వంటి హాలీవుడ్ చిత్ర పాత్రలనే కాకుండా, మనకు నచ్చిన జంతువులు, పక్షులు, వస్తువుల ఆకారాలను కూడా చేసిస్తుందట. అయితే అన్నీ నట్టులు, బోల్టులు, పనికి రాని

ప్లగ్గులతో చేసినవే. కాకపోతే వీటి ధర మాత్రం ఓ రేంజ్‌లో వుంటుంది. కావాలంటే ఇంట్లో అలంకరించుకోవచ్చు. నేస్తాలకూ బహూకరించొచ్చు. అది మనిష్టం అనుకోండి. బొమ్మ తయారీ పూర్తయ్యాక... మనం చెప్పిన చిరునామాకు బొమ్మను అందించే పూచీ కూడా ఆ కంపెనీదే. బొమ్మ రవాణాకు అయ్యే ఖర్చు సైతం తీసుకుంటుందిలెండి.



ఐ ఫోన్ ఇస్తే ...ఇల్లు రాసిస్తా

అంటోంది మేం కాదండీ బాబూ! ఓ డెట్రాయిట్ వాసి. ఈయనగారికి అక్కడో ఇల్లు వుంది. ప్రస్తుతం దీనిమార్కెట్ విలువ 5 వేల డాలర్లు. పాపం గత కొంత కాలంగా దాన్ని అమ్మాలని చూస్తున్నాడు. ఎవ్వరూ కొనడానికి ముందుకు రావట్లా. కారణాలు రెండున్నాయి. ఒకటేమో బకాయిపడిన పన్నులు. రెండు చాలా కాలంగా వాడకంలో లేక...పాడైపోవడం. దాంతో ఈయనగారు పత్రికా ప్రకటనలు ఇవ్వడమే కానీ... ఒక్కరు కూడా తొంగి చూడట్లా. ఇక విసుగెత్తిన ఓనరు గారు. ఒక ఆఫరు ఇచ్చాడు. అదేనండీ రాని కొనుగోలుదార్లకు. ఏమనంటే... 'ఐ ఫోన్ 6 ఇస్తే చాలు. నా ఇల్లు రాసిస్తా' అని. ఎంతలేదన్నా ఐఫోన్ 3 వేల డాలర్లు పలుకుతుంది కదా. అదన్నమాట మనోడి దూరాలోచన. అయినా ఎవ్వరూ రావడం లేదండీ. అదీ మనోడి బాధ. ఇంక అంతకంటే తక్కువ ధరకు దిగి...ఏం ఆఫర్ ఇవ్వాలో తెలియక...తికమక పడుతూ... ఎదురుచూస్తున్నాడు కొనుగోలుదారుల కోసం.

కలప కారు

చెక్కతో కార్లు, బైకులు తయారుచేయడం గురించి ఇప్పటికి చాలా సార్లు విని వుంటాం. చదివీ వుంటాం. కాకపోతే ఇక్కడ ఇప్పుడు మీ ముందున్న కారు ప్రత్యేకత ఏంటంటే... ఇది పూర్తిగా టేకుతో చేయబడిన కారు. అదీ బెగట్టి వేగాన్ సూప్ స్పోర్ట్స్ కారుకు జిరాక్స్ కాపీలా వుంటుంది. మూడు వారాల నుంచి నెల రోజుల సమయం పట్టింది దీని తయారీకి. ఇక ఖర్చంటారా! రహస్యం? పెద్దమొత్తంలోనే అయ్యిందని వినికిడి. ఇంత చేసీ ఇది నడపడానికి, ప్రయాణించడానికి పనికి రాదు. అలా సోగ్గా వాకిట్లో పెట్టుకోడానికే. అయినప్పటికీ మాంచి డిమాండ్ వుందండోయ్ దీనికి. ఇలా తయారు చేసే వాహనాలను అమెరికా, ఇంగ్లండ్, జర్మనీలో...అమ్ముతుంటారు. ★

నవ్వుల్ – పువ్వుల్

కొడితే కొట్టాలి!



రాంబాబు : మా గుడిలో పూజారి క్రికెట్ పిచ్చోడురా..!
సోంబాబు : ఏమైయిందేంటీ?
రాంబాబు: గుడిలో దక్షిణ వేసినప్పుడల్లా 'సిక్సర్ కొట్టు' అంటున్నాడురా...!

ఎలా?

అపరిచితుడు : మీకీ మధ్యనే పెళ్లయిందా?
కిషోర్ : అవునండీ, ఎలా చెప్పగలిగారు?
అపరిచితుడు : మరేం లేదు, మరీ అన్యోన్యంగా మాట్లాడుకుంటుంటేనూ...!

వ్యంగ్యం

ప్రేక్షకులు : మీరు కవిత చదువుతారా, మేమందరం కళ్లు మూసుకోవాలా, అదేం...?
కవి : మరేం లేదు, నేను చదవడం మొదలుపెట్టినప్పుడు చెవులు గాని మూసుకుంటారేమోనని...!

అప్పటి నుంచి



మోహన్: డార్లింగ్ స్వీట్ తింటావా....?
సింధు: వద్దు, నాకు షుగర్ వుంది...!
మోహన్: నీకు షుగరా, నాకెప్పుడూ చెప్పలేదే...?
సింధు: నిన్ను ప్రేమించాకే నాకు షుగర్ వచ్చింది...!
మోహన్: అదేంటి...?
సింధు: ఆరు నెలల క్రితం ఒకసారి ఐస్‌క్రీమ్ కొనిచ్చారుగా, అది తిన్నప్పటి నుండి వచ్చింది...!

పేరు



వంశీ : ఏరా, మనం తినే ప్రతి మెతుకుపైనా, మన పేరుంటుందట కదా!
ప్రదీప్ : అవునురా, ఇప్పుడేముంది...?
వంశీ : మరేంలేదు, ఈ మెతుకుపై నా పేరు చూపించు...!

దానం



బిచ్చగాడు: అయ్యా, గుడ్డివాణ్ణి. ధర్మం చేయండి బాబయ్యా
వెంకట్ : ఇంద, ఈ రూపాయి తీసుకో...!
బిచ్చగాడు: నాకు కావలసింది రూపాయి కాదు బాబయ్యా, మీ రెండు కళ్లు...!

తింటేగాని...

కృష్ణారావు : కుక్క బిస్కెట్లు వున్నాయా...?
షాపు యజమాని : ఆ వున్నాయి...!
కృష్ణారావు : రుచిగా ఉంటాయా...?
షాపు యజమాని : ఏమో, మీరు తిని చెప్తే గానీ తెలీదు, రుచిగా ఉంటాయో, లేదో...

అచ్చం అలా

రాజు : నీ డ్రెస్ చాలా బావుంది..
సందీప్ : అయితే వుండు... విప్పి ఇచ్చేస్తా...!
రాజు : అదేంటి...?
సందీప్ : నేనూ ఇలాగే ఈ డ్రెస్ వేసుకున్నతన్ని అడిగా... అతనూ ఇలానే చేశాడు మరి...!

వణుకుతుంటే

సత్యం : అయ్యో, అక్కడ పెద్దగా మంటలంటుకున్నాయి. ఫైర్ స్టేషన్ వారికి ఫోన్ చేయండి..
పవన్: ఆ మంట వేసిందే ఫైర్‌స్టేషన్ సిబ్బందట...చలికి కాచుకోవడానికి...!

దేశదిమ్మరి

శ్రీను : నేను చాలా దేశాలు తిరిగాను తెలుసా..?
కృష్ణ : ఏం దేనికి...?
శ్రీను : ఏ దేశం వారైనా నాకు ఆ దేశాధ్యక్ష పదవి ఇస్తారేమోనని..!

- ముత్యాల శ్రీశరత్‌బాబు,

ఫోన్ నెం : 9963298921

మనిషి ఆశాజీవి

◆ కథ

వి.వి నరసమ్మ

రోడ్డుకి ఆవలగా ఓ ఇంట్లో నుండి ఒకామె తట్టలో ఏదో తెచ్చి గేటుకి బైటగా వుంచింది. సరిగ్గా అక్కడే మాటు వేసిందో కుక్క. పొదుగు నిండుగా పాలతో ఉన్న ఆ శునకం... తట్టలో వున్నదాన్ని నోట కరచుకొని భద్రంగా రోడ్డుకి ఈవలగా వున్న మా ఇంటి ముందరి ఖాళీ జాగా వైపు అడుగులేస్తోంది. ఆ చోటంతా పిచ్చి మొక్కలతో నిండి ఎదురు అపార్టుమెంటువాళ్లకు చెత్త కుండీలా ఉపయోగపడుతోంది.

తట్టలో ఉన్నదేంటా అని శాంతమ్మ ఆరాగా చూస్తుంటే ... ఆమె వెనకాలే వున్న దుర్గ "చూడండమ్మా! ఆ కుక్క పసికూనను ఎంత భద్రంగా తెచ్చుకుంటుందో!" అంది కుతూహలంగా.

'ఏంటీ నోట కరుచుకున్నది కుక్కపిల్లనా! కొన్ని కొన్ని సందార్భల్లో కుక్కను గౌరీదేవని పూజిస్తారుగా. అలా దానికి తినడానికేమైనా పెట్టారేమో అనుకున్నానే...' అంది శాంతమ్మ.

'లేదమ్మా! పెద్ద వర్షం పడింది కదా! ఇప్పటికే దాని మిగిలిన పిల్లలన్నీ ఈదురుగాలికి చచ్చిపోయాయి. ఈ ఒక్కటే మిగిలింది. దానిని ఎదురింటామె వర్షానికి ముందే తట్టలో నెట్టింది. మీరు చూశారో లేదో పొద్దుట్నుండి ఈ కుక్క గేటు ముందే కాపుకాసింది. వర్షం తగ్గిందిగా. అందుకని ఆమె ... ఆ తట్టను తెచ్చి బైట వుంచితే ఇదేమో భద్రంగా పిల్లను తెచ్చుకుంటోంది...' అంటూ తనకు తెలిసిన వివరాలన్నిటిని నా ముందుంచింది.

'అమ్మకు బిడ్డల పట్ల వుండే మమకారం అక్షరాలకు అందనిది....' అనుకుంటూ ...అలా చూస్తుండిపోయింది శాంతమ్మ.

❄❄❄

గాలికి కొట్టుకుపోతున్న పేపర్ని తెచ్చి శాంతమ్మ ఒడిలో ఉంచింది దుర్గ. ఇంతకుముందే ఆ జిల్లా పేజీల్లో... ఓ విడ్డూరపు వార్త చదివిందామె. అందులో నుండి తేరుకోకమునుపే ఈ కుక్క పిల్ల ఘటన జరిగింది.

పులులూ, సింహాలూ దొంగల బారి నుండో కాదు. కూతుళ్లూ, అల్లుళ్ల బారినుండి భార్యను తననూ కాపాడాల్సిందిగా ఓ తండ్రి వేడుకోలు. ఇద్దరమ్మాయిలకు చెరో పదెకరాల పొలం కట్నంగా ఇచ్చి అంగరంగ వైభోగంగా వివాహాలు జరిపించాడు. తీరా అవసాన దశలో అవసరాల కోసం ఉంచుకున్న భూమి విలువైంది (రాజధాని ప్రకటన తర్వాత మరీ) ఏమైపోతుందో అన్న భయంతో ఈ ముసలివాళ్లను ఏం చేయాలనుకున్నారో ఏమో!

అన్ని బంధాలను కొండచిలువలా మింగేసేది ఆర్థిక బంధమేనేమో చాలా చిరాగ్గా అన్పించింది శాంతమ్మకు.

"ఇంట్లో ఇక పనేం లేదులే దుర్గా! నువ్వెళ్లు. నాకూ వంట పనిలేదు. ఇవాళ లక్ష్మమ్మ మామ్మ దినం కదా! అప్పుడేపోయి పదిరోజులైంది....అటు వెళ్తాను...' అంటూ దుర్గను పంపించేసింది.

❄❄❄

అదో పెద్ద ఫంక్షన్ హాలు, ఏర్పాట్లు భారీగా చేసినట్లున్నారు. పిల్లలంతా దండిగా వున్నవాళ్లే గదా!

భోజనాల దగ్గర అన్ని వరసల్లో కుర్చీలు నిండిపోయాయి. పక్క హాల్లోని కుర్చీలూ ఒకటీ అరా తప్ప ఖాళీల్లేవు. ఎదరుచూస్తున్న వాళ్లతో నిండిపోయాయి.

"ఇక్కడ కూర్చుందురు రండి..." ఖాళీ కూర్చీ చూపిస్తూ శాంతమ్మను పిలిచింది పాత నేస్తం కమల.

నోళ్లు కట్టేసుకు కూర్చోలేరు గదా! కాలక్షేపం కబుర్లు ... రకరకాల వ్యాఖ్యానాలు... మొదలయ్యాయి.

'ఎంత పెద్ద హాళ్లైనా వైటింగు తప్పట్లా..' అంటూ ప్రారంభించిందో పెద్దావిడ. ఆకలికి

" పల్లెటూరు కాబట్టి ఒక్కతైనా ఉండగలిగింది' అన్నారెవరో.
'అదేం లేదులెండి పల్లెటూళ్లల్లో సైతం వెనకటిలా ఇరుగు పొరుగూ అంటూ కలివిడితనం ఏం లేదు...' అనుభవ పూర్వకంగా అన్నదొకావిడ.
'సెల్ టవర్లొచ్చి పిచ్చుకల ప్రాణాలు తీస్తే టీవీలొచ్చి మానవ బంధాల్ని తెంపేస్తున్నాయ్...' అన్నారెవరో వైరాగ్యం తొణికిసలాడుతున్న స్వరంతో.
'ఎందుకొచ్చిన తిప్పలు మామ్మా, నువ్వు లక్షణంగా పిల్లలింటికెళ్లి ఉండవచ్చు గదా! నిన్ను కాదనేదెవరని ఎవరైనా నోరూరుకోక అంటే... ఊరుకునేది కాదండీ.
'ఎందుకులేమ్మా! ముసలమ్మ ఇక్కడ పాసుకెళ్లిందీ, అక్కడ పాసుకెళ్లిందీ అంటూ మాటలు పడేకంటే కన్న బిడ్డలా కనిపెట్టుకుంటున్న మా భద్ర ఉన్నంతవరకూ నాకేం పరవాలేదు' అనేది భరోసాతో' అందొకావిడ. "

ఆగలేక అనుకుంటా.

'చాలా మందిని పిలిచినట్లున్నారు...' ఎదురుచూడాల్సి రావడానికి ... తను గుర్తించిన కారణాన్ని చెప్పింది ఒకావిడ.

'పిల్లలు నలుగురూ సిటీలోనే వున్నారు. చుట్టాలూ, పక్కాలు ఎక్కువేగా...' వచ్చిన అతిథులను గమనిస్తూ అంది మరో పెద్దావిడ.

'అంతమంది వుండీ వృద్ధాశ్రమం తప్పలా. ఎనభయ్యో పడి దాటే వరకూ ఆ పల్లెటూర్లో తన ఇంట్లోనే పనిమనిషి సాయంతో కాలం గడిపేసింది....' మెల్లగా అసలు విషయం ఎత్తింది సంభాషణ ప్రారంభించిన పెద్దావిడ.

'పల్లెటూరు కాబట్టి ఒక్కతైనా ఉండగలిగింది' అన్నారెవరో.

'అదేం లేదులెండి పల్లెటూళ్లల్లో సైతం వెనకటిలా ఇరుగు పొరుగూ అంటూ కలివిడితనం ఏం లేదు...' అనుభవ పూర్వకంగా అన్నదొకావిడ.

'సెల్ టవర్లొచ్చి పిచ్చుకల ప్రాణాలు తీస్తే టీవీలొచ్చి మానవ బంధాల్ని తెంపేస్తున్నాయ్...' అన్నారెవరో వైరాగ్యం తొణికిసలాడుతున్న స్వరంతో.

'ఎందుకొచ్చిన తిప్పలు మామ్మా, నువ్వు లక్షణంగా పిల్లలింటికెళ్లి ఉండవచ్చు గదా! నిన్ను కాదనేదెవరని ఎవరైనా నోరూరుకోక అంటే... ఊరుకునేది కాదండీ. 'ఎందుకులేమ్మా! ముసలమ్మ ఇక్కడ పాసుకెళ్లిందీ, అక్కడ పాసుకెళ్లిందీ అంటూ మాటలు పడేకంటే కన్న బిడ్డలా కనిపెట్టుకుంటున్న మా భద్ర ఉన్నంతవరకూ నాకేం పరవాలేదు' అనేది భరోసాతో' అందొకావిడ.

'కళ్లే తిరిగినయ్యో.... కాలే జారిందో... పడిపోయింది... పిల్లల దగ్గరకు రాక తప్పలా...' అసలు కారణాన్ని చెప్పిందొకావిడ.

'మొదటి నుండీ ఆసరాగా వుండేది రెండో కూతురే. ఆవిడే తీసుకొచ్చి తమ భవనాన్ని ఆనుకొని వున్న వేరే ఇంటిలో వుంచింది. వేళకు భోజనం టిఫిన్ సదుపాయాలు చూడడానికి ఓ మనిషిని పెట్టారు...' అంది మరొకావిడ.

'తెల్లగా మెరిసిపోయే ఫ్లోరింగు మాసిపోతుందికదా. పైగా...అంత పెద్ద ఇంట్లో ఉండేది భార్యాభర్తా ఇద్దరే. కొడుకులు వేరే వేరేనే. ఎవరి స్వేచ్ఛ వాళ్లకుండాలిగా!' అంది మరొకావిడ మూతి విరుస్తూ.

'ఆ పద్ధతిలో ఓ ఏడాది గడిచిందో లేదో...ఆ మాత్రం చూడ్డానికి కూడా విసుగొచ్చినట్టుంది. నలుగురు పిల్లలుండగా తనొక్కటే బాధ్యతనెందుకు నెత్తికెత్తుకోవాలనుకున్నట్టుంది. పిల్లలందరూ కలిసి ఓ సమావేశం జరిపారు. తలా రెండు నెలల చొప్పున పంచుకున్నారు.' అందొకావిడ ముక్కు మీద వేలు వేసుకుని.

'అయినా... మనవళ్లు, మనవరాళ్లను ఎంత గారాబంగా పెంచింది మామ్మ. తన ఆనందం కోసం పెంచింది వాళ్లందర్నీ...' అందర్నీ అంత ప్రేమగా సాకినా ... పంపకాలు తప్పలేదన్న బాధతో అంది పెద్దావిడ.

'పెద్దతనం వచ్చాక ఓ కొత్తచొటుకి అలవాటుపడడం ఎంత కష్టం? అలాంటిది రెండు నెలలకో కొత్తచోటు...' అంది మరో పెద్దావిడ.

'ఆ... ఆ ముచ్చటా అయ్యింది. చివరికి వృద్ధాశ్రమానికి తోలేశారుగా. ఈ బాధలన్నీ చూడలేక...పడలేక... నాలుగు నెలలు తిరక్కుండానే చాప చుట్టేసింది....' అందో నడివయసు మహిళ.

'ప్చ్ పాపం' అన్నారు ఐదారుగురు ఏకకంఠంతో.

ఎవరికి తోచినట్టు వాళ్లు, ఉచిత కాలక్షేపం చేస్తుండగా... బంతి లేచినట్లుంది. ఖరీదైన గిఫ్టుల పంపకం మొదలైంది.

❄❄❄

ఇంటికొచ్చి పండుకున్న శాంతమ్మలో ఒకటే అశాంతి. ఎవ్వరినీ వదలంది వృద్ధాప్యం.

జీవిత చరమ దశలో సైతం విరక్తి కలక్కుండా ఆనందంగా గడిచిపోయే మార్గం లేదా!?

భర్త సూర్యం మాటల్లో అయితే వున్న మానవ సంబంధాలు సమసమాజంలోనే రూపుదిద్దుకుంటాయి.

ఆర్థిక అసమానతలంతగా ఉండవు గనుక.

అభిజాత్య ప్రదర్శనలేని అన్ని దశలలో మానవ సౌభాగ్యానికే ఆదరణ ఉంటుందని.

ఏమైనా మనిషి ఆశాజీవి.

★

◆ కవిత్వం

ప్రాణం తెగిన పాదరక్షలు

రోడ్డు కిక్కిరిసి నడుస్తూంది
ఫుట్‌పాత్‌లు ప్రేక్షక పాత్ర మాని
మేమున్నామంటూ సగం భారాన్ని
పంచుకున్నాయి
రెండు పుల్లలు నిటారుగా
రెండు పుల్లలు ఏటవాలుగా
రెండు తాటాకులు కప్పుగా
ఫుట్‌పాత్‌పై నిల్చిన ఆవాసం కింద
నలిగిన చర్మకారుడి పద్మాసనం
చిరునామా చాటుతూ ముందు
గుట్టపోసిన పాత పాదరక్షలు
భుజంపై వాలిన మనవరాలు
తాత చెవిలో కబుర్లు పోస్తూ వుంది
మధ్య మధ్య తాతయ్య నవ్వులు
తొడపై మెడవాల్చి కూర్చున్న కుక్క
చెవులు రిక్కించి ప్రపంచం పరికిస్తూంది
పరుగులు తీసిన మనవరాలు
బిస్కత్తులతో ప్రత్యక్షమై
తాతయ్య నోటిని తీపిచేసి
నమ్మినబంటుకు ఒకటి అందించింది!
అంతవరకు రోడ్డుపై నాజూగ్గా నడిచిన
పాదాలు
పట్టుతప్పి పక్కకు సోలిపోతున్నాయి
హుందాగా నడిచిన నడకలు
భూమిపై జీరాడుతున్నాయి
చెప్పు తెగిన పాదాలు ప్రార్థిస్తున్నాయి
పాదరక్షలు సరిచేసి
కాళ్లకు ప్రాణ ప్రతిష్ట చెయ్యమని –
చెప్పులు అతుకులు వేసుకుంటున్నాయి
అరె బాణంలా దూసుకుపోతూంది
అక్కడ కులాలు లేవు
మతాలు లేవు
భేదాలు లేవు
భేషజాలు లేవు
పని చేయించుకున్నవాడు
తోచిన ప్రతిఫలం ఇస్తున్నాడు
పనిచేసిన వాడు
ఇచ్చిందే పుచ్చుకుంటున్నాడు!
పడమటి కొండల్లోకి సూర్యుడు ప్రవేశించాక
అందరి పాదాలకు కవచాలు అమర్చినవాడు
రక్షణ లేని పాదాల్తో ఇంటికి పయనం
మనవరాలు
గ్రామ సింహం
రక్షణగా –

- అడిగోపుల వెంకటరత్నమ్

▪ ఫోన్: 91 9848252946

నేల మీది స్వర్గం అని రాస్తుంటారు కవులు, రచయితలు. అలా... నీటిమీద మనుషులు సృజించిన అందమైన దీవి అట్లాంటిస్. కాకపోతే ఇలాంటి దీవులను సృష్టించాలీ అంటే సంకల్పం నిండుగా వుండాలి. డబ్బు చేతినిండుగా వుండాలి. ఇక చెయ్యలేనిదేముంది చెప్పండి. ఇదిగో మీ ఎదురుగా వున్న సౌకర్యాలు, అందాలు, మానవ కట్టడాలు...అన్నీ అలా రూపొందినవే. ఇంతకీ ఇంత ఖర్చు పెట్టి నీళ్లల్లో ఇంత అందమైన దీవిని కట్టింది ఎందుకంట? అంటారేమో! పర్యాటకులను ఆకట్టుకోడానికి. మరింత సొమ్ము చేసుకోడానికి. ఆలస్యం ఎందుకు! ఇదిగో అరేబియన్ గల్ఫ్‌లోని పామ్‌జుమేరాకి ముఖద్వారం ఇదే. విశేషాలేంటో తెలుసుకుందాం పదండి.

అందాల దీవి అట్లాంటిస్

ఎక్కడైతే పోయిందో అక్కడే వెతుక్కోవాలని పెద్దలు చెప్తుంటారు. సాగరగర్భంలో కలిసిపోయిన అట్లాంటిస్‌ను సాగరంలోనే నిర్మించాలనుకున్నట్లున్నారు. అందుకే నిన్న బహమాస్‌లో, నేడు పామ్‌జుమేరాలో అట్లాంటిస్ రిసార్ట్‌లను నిర్మించారు కెర్జ్‌నర్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు.

పామ్‌జుమేరా

చుట్టూ అనంతసాగరమే. నింగీ నీరూ ముద్దాడుతున్నట్లుగా ఉండే ఆ నీలి ప్రపంచంలోకి ఆహ్వానిస్తున్నట్లుగా ఉంటుందీ రిసార్ట్. మొత్తం 560 హెక్టార్ల సాగర జలాల్ని దీవులుగా మార్చి మరీ పామ్‌జుమేరా నిర్మించారు. అందులో 46 హెక్టార్ల (116 ఎకరాలు)లో అట్లాంటిస్ రిసార్ట్... మొత్తం 1539 గదులు (అంటే 150 సూట్‌లు), ఖరీదైన బొటిక్‌లు, సెలెబ్రిటీ షెఫ్ రెస్టారెంట్లు, నైట్ క్లబ్, కిడ్స్ క్లబ్, స్పా, ఫిట్‌నెస్ క్లబ్, పెద్ద ఫంక్షన్‌హాల్... హంగుల సంగతి చెప్పేదేముంది?

అట్లాంటిస్

పామ్‌జుమేరాకి ప్రవేశద్వారంగా కనిపించే అట్లాంటిస్‌లో ద్వారానికి రెండువైపులా రెండు టవర్లుంటాయి. అవే రాయల్ టవర్స్. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో వారధి. దీన్నే బ్రిడ్జిసూట్‌గా పిలుస్తున్నారు. ఇక్కడున్న సూటులన్నింటిలోకి ఖరీదైనదీ పెద్దదీ ఇదే. రాయల్ టవర్స్‌లోని ప్రతీ సూట్ నుంచి అరేబియన్ గల్ఫ్ కనువిందు చేస్తుంటుంది.

అక్వేరియం

అన్నింటికన్నా... దాదాపు 42 మిలియన్ లీటర్ల సాగర జలాల్లో 250 జాతులకు చెందిన 65 వేల సముద్ర జీవులతో రిసార్టును చుట్టినట్లుగా ఉన్న ఎక్వేరియం అట్లాంటిస్‌కు ప్రధాన ఆకర్షణ. ఇందులో ప్రధానమైనది అంబాసిడర్ లాగూన్. 11 మిలియన్ లీటర్ల నీటితో ఉన్న ఈ లాగూన్‌లో సముద్రజీవులతోపాటు నాటి అట్లాంటిస్ నగర ఆనవాళ్లను పోలిన నమూనాలనూ అంతరించిపోయిన మరికొన్ని సముద్రజీవుల నమూనాలనూ చూడొచ్చు. నక్షత్ర చేపలూ, పెన్సిల్ అర్చిన్లూ, గుర్రపుడెక్కనత్తలూ, సాలీళ్లూ తిరుగుతూ ఆసక్తిని రేకెత్తిసుంటాయి. మూడు అంతస్తులుగా నిర్మితమైన లాస్ట్ ఛాంబర్, నెప్ట్యూన్ లేదా పొసిడీయన్ సూట్ల నుంచయితే నేరుగా కనిపిస్తుంటుంది. చుట్టూ సముద్రజీవులు తిరుగుతూ మరోలోకంలో ఉన్న అనుభూతిని కలిగిస్తాయి.

జలకాలాటలలో...

అట్లాంటిస్ అనగానే పర్యాటకులకు గుర్తొకొచ్చేది మరొకటుంది. అది 17 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించిన ఆక్వా వెంచర్ జలకాలాటల విభాగం. 18 మిలియన్ల లీటర్ల నీటితో ఏర్పాటు చేసిన ఆక్వా వెంచర్‌లో కయా కింగ్, విండ్ సర్ఫింగ్ వంటి జలక్రీడలూ ఉన్నాయి. ఇక్కడే మెసపొటేమియా నాగరికతను పోలిన జిగురాట్ ఆలయం ఉంటుంది. 30 మీటర్ల ఎత్తులో ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఉండే ఈ కట్టడంలో ఏడు వాటర్ స్లైడులను ఏర్పాటు చేశారు. వీటిలోని రెండు స్లైడుల నుంచి జారితే షార్క్ లాగూన్లనీ చుట్టి రావొచ్చు. సొరచేపల మధ్యలో విహారమన్న మాట. భయపడాల్సిన పనిలేదు... అవి మీదకి వస్తున్నట్లే ఉంటాయిగానీ మన చుట్టూతా గాజు గది ఉంటుంది. పక్కనే ఉన్న డాల్ఫిన్ బేలో డాల్ఫిన్లతో ఆటలాడుకోవచ్చు.

రాయల్ టవర్స్

తరువాత చెప్పుకోదగ్గది ఇంటీరియర్ డిజైనింగ్. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వాస్తు శిల్పులు, డిజైనర్లు, ఆర్టిస్టులు... అందరూ కలిసి ఈ రిసార్టుని తీర్చిదిద్దారు. అత్యంత ఖరీదైన పాలరాతి పలకలు, గాజు శిల్పాలు, వెరైటీ షాండ్లియర్లు, యాంటిక్ అద్దాలు, మహాగని చెక్కగోడలు.. వేటి అందం వాటిదే. వాటిలో చెప్పుకోదగ్గది డేల్‌చిహులీ గాజుశిల్పం. 3 వేల ముదురు గోధుమ రంగు గాజు ముక్కలతో 10 మీటర్ల ఎత్తున రూపొందించిన ఈ కళాఖండం, ప్రధాన హాలులో చూపరుల్ని కట్టిపడేస్తుంది.

రాయల్ టవర్స్‌లోని గ్రాండ్ లాబీలోకి అడుగు పెట్టగానే అక్కడున్న నీళ్లు, కాంతిధ్వనులతో ఏర్పాటైన ఫౌంటెయిన్ స్వాగతిస్తుంది. అక్కడి నుంచి ట్రావెర్టయిన్ పాలరాళ్లమీదుగా నడుస్తుంటే వినిపించే నీటిధ్వని చుట్టూ ఉన్న సముద్రాన్ని మళ్లీ మళ్లీ గుర్తుతెస్తుంటుంది.

కిడ్స్ క్లబ్

3 నుంచి 12 సంవత్సరాల్లోపు పిల్లల కోసం ఏర్పాటు చేసిన కిడ్స్ క్లబ్ వారికి నిజంగానే మాంచి ఆటవిడుపు. అక్కడ పెద్దలకు ప్రవేశం ఉండదు మరి. దీని పర్యవేక్షణ బాధ్యతంతా టీనేజీ పిల్లలదే. ఇక ఈ సుందరలోకం వినోద కేంద్రంగానే కాదు, రుచులకూ నిలయమే. ప్రముఖ షెఫ్‌లతో ఏర్పాటు చేసిన 17 రకాల రెస్టారెంట్లు, బార్లు, లాంజ్‌ల్లో కోరుకున్న వంటకాలు క్షణాల్లో ముందుంటాయి. సీఫుడ్ గురించైతే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పైగా ఇవన్నీ వైవిధ్యభరితమైన అలంకరణలతో అతిథులను అలరిస్తుంటాయి. మొత్తంమీద ఆధునిక వింతల్లో ఒకటైన అట్లాంటిస్ పర్యటన... ఓ సరికొత్త సాగరలోకాన్ని కళ్లముందు సాక్షాత్కరింపజేస్తుంది.

ఖర్చు కూడా అదుర్స్!

సాగరగర్భంలో కలిసిపోయిన వేల సంవత్సరాలనాటి అట్లాంటిస్ దీవి ఎలా ఉండేదో మనకు తెలీదు. అయితే కడలి కెరటాలపై నిలిచిన వినోద కేంద్రమైన అట్లాంటిస్‌లో విడిది చేయాలంటే మాత్రం పైసలుండాల్సిందే. ఎందుకంటే దీని నిర్మాణానికైన ఖర్చే సుమారు 7,500 కోట్ల రూపాయలు. అందుకే ధరలన్నీ భారీగానే ఉంటాయి. సాధారణ సూట్‌ల ధర 23వేల రూపాయల నుంచీ మొదలు. ఇద్దరికయితే ఒక రాత్రికి 38 వేల రూపాయలు. అదే బ్రిడ్జిసూట్‌కయితే ఒక్క రాత్రికి సుమారు అక్షరాలా 13 లక్షల రూపాయలు. అట్లాంటిస్‌లోని ఆక్వావెంచర్‌ను సందర్శించాలంటే రిసార్టులో దిగాల్సిన అవసరమే లేదు. దుబాయ్‌వాసులూ పర్యాటకులూ పగటివేళ ఎప్పుడైనా వెళ్లొచ్చు. పెద్దవాళ్లకయితే రోజుకి సుమారు 3,700 రూపాయలు, పిల్లలకయితే రూ. 2,800 చెల్లిస్తే చాలు... అలసిపోయేవరకూ ఆడుకోవచ్చు. అలాగే లాస్ట్ ఛాంబర్స్, డాల్ఫిన్, షార్క్ లాగూన్లనీ టికెట్లతో సందర్శించవచ్చు. అంటే... దుబాయ్‌గానీ వెళ్తే గిళ్తే... అట్లాంటిస్‌ను మిస్సవ్వ కూడదన్నమాట.

✡

'బాల'యోధులు

మహిళలు చదువుకోకూడదు. బురఖాలు వేసుకోకుండా బయటకు రాకూడదు. గోళ్లకు రంగు వేయకూడదు.... ఇవన్నీ తాలిబన్ల ఫత్వాలు. అయితే పన్నెండేళ్ల చిన్నారి వీటిని ప్రశ్నించింది. నేను బురఖా ఎందుకు వేసుకోవాలి? నేను చదువుకుంటే ఏమవుతుంది? నేను బురఖా లేకుండా స్కూలుకెళ్తే ఏమవుతుంది? అని నిలదీసిన సాహస బాలిక మలాలా యూసఫ్‌జాయ్. వాటికి బదులు ఇవ్వలేని తాలిబన్లు ఆమెమీద బుల్లెట్లు కురిపించారు. సంకల్ప బలం ముందు తూటాలెంత? మరింత శక్తిని కూడదీసుకుని ... కేవలం స్వదేశంలోనే కాకుండా... ప్రపంచంలోని ఆడపిల్లలందరి చదువుకోసం పోరాటం సాగిస్తోందా చిన్నారి.

ట్రాక్టరు షెడ్డులో, టీ బంకుల్లో, క్వారీల్లో, టపాసుల ఫ్యాక్టరీల్లో మగ్గిపోతున్న బాల్యాన్ని ... కందిపోతున్న చిట్టి చేతులను ... బాధలను భరించలేక కన్నీరుకార్చే లేత నయనాలు చూసి.... చలించిపోయాడు కైలాస్ సత్యార్థి. విజ్ఞానంతో వికసించాల్సిన బాల్యం వెట్టి చాకిరిలో మగ్గిపోవడాన్ని సహించలేకపోయాడు. 'బచ్‌పన్ బచావో అందోళన్'ను ప్రారంభించి వేలాదిమందిని వెట్టి నుంచి విముక్తులను చేశాడు.

చిన్నారుల హక్కులకోసం పోరాడుతున్న ఈ బాల యోధుల కృషికి.... అత్యంత ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారం వరించిన సందర్భంగా... ఈ వారం అట్టమీది కథ.

- కె. అంజన

అది బర్మింగ్‌హామ్‌లోని ఓ స్థానిక పాఠశాల. ఉదయం 10.15 గంటలు. రసాయన శాస్త్రం తరగతి జరుగుతోంది. అప్పుడు టీచర్ పదిహేడేళ్ల అమ్మాయిని పక్కకు పిల్చి... ఆ పాపకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి వచ్చిన విషయం తెలియచేసింది. అవార్డు వస్తుందని ఊహించని చిన్నారి ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బైంది. ఆ సంతోషంలో మిగిలిన క్లాసులకు డుమ్మా కొట్టలేదు సరికదా! పూర్తిగా క్లాసులన్నీ అయ్యే వరకు అక్కడే వుంది. ఈ పాటికే మీకు అర్థమైవుంటుంది ఆ అమ్మాయి ఎవరో! అవును... తనే పాకిస్తాన్ సాహస బాలిక మలాలా యూసఫ్ జాయ్. క్లాసుల అనంతరం పత్రికల వారి ముందు ఆ అమ్మాయి చెప్పిన విషయాలు ప్రపంచంలోని ప్రతి తండ్రి తప్పక గుర్తుంచుకోవాల్సిన వాక్యాలు. 'నా వెనక నిలబడిన నా కుటుంబానికి ధన్యవాదాలు. వెన్ను తట్టి నన్ను ముందుకు నడిపిన నా ప్రియమైన అమ్మకు, నాన్నకు ధన్యవాదాలు. మా నాన్న నాకు ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదు. నేను పైకి ఎగరడానికి కవాల్సిన రెక్కలు కట్టి వేయలేదంతే. నన్ను స్వేచ్ఛగా ఎగరనిచ్చినందుకు నాన్నకు ధన్యవాదాలు' అన్నదా చిన్నారి. విన్నారా నాన్నలూ...!

సాహస బాలిక

పాకిస్తాన్‌లోని 'స్వాత్' ప్రాంతం. ఇటీవల వార్తల్లో అధికంగా వినిపిస్తున్న పేరు. హిందూకుష్ కనుమల్లో అందమైన లోయ. తూర్పు స్విట్జర్లాండ్‌గా ప్రసిద్ధి. ఓ వైపు పచ్చని చెట్లు, మరోవైపు వేగంగా ప్రవహించే నదులు! అందులో ఒకే ఒక్క నగరం మింగోరా. అదే మలాలా పుట్టిన గడ్డ. తండ్రి ... జియాఉద్దీన్ యూసఫ్ జాయ్. విద్యాధికుడు. స్కూలు యజమాని. విద్యా హక్కు కార్యకర్త. తాలిబన్లకు వ్యతిరేకంగా

గట్టిగా నిలబడి పోరాడిన సాహసి. తల్లి ... తోర్‌పెకై! గృహిణి. వీరి తొలి సంతానం మలాలా. 19వ శతాబ్దంలో ఆఫ్ఘన్–బ్రిటిష్ యుద్ధం జరిగినప్పుడు మలాలాయ్ అనే యువతి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిందట. ఆమె పేరును తన కుమార్తెకు పెట్టాడు జియాఉద్దీన్. తన చిట్టితల్లి కూడా ఆమెలా సాహసి కావాలని కోరుకున్నాడా తండ్రి. కుమార్తెకు చక్కటి బుద్ధిని, వ్యక్తిత్వాన్ని, ధైర్యసాహసాలను నూరిపోసిందా తల్లి. అమ్మానాన్నల నుంచి లభించిన ప్రోత్సాహం, మద్దతుతోనే మలాలా అక్షరాలు నేర్చుకోవడానికి అంతగా పట్టుబట్టగలిగింది.

స్వాత్ లోయలో ప్రకృతి సౌందర్యంతోపాటుగా... తాలిబన్ల అరాచక ఆంక్షలు, పాలన కూడా వుండేది. 2007 నుంచి 2009 వరకు ఈ లోయ వారి ఏలుబడిలోనే వుంది. అక్కడ ఆడపిల్లలు, మహిళల జీవితం అనేక కట్టుబాట్లు, నిషేధాల మధ్య నడిచేది. వారు బురఖా వేసుకోకుండా బైటికి అడుగు పెట్టకూడదు. సన్నిహిత బంధువులతో తప్ప ఇతర పురుషులతో మాట్లాడకూడదు. ఇంట్లో టీవీ చూడ్డానికి కూడా లేదు. వీధుల్లో ఆడుకోడానికి లేదు. మహిళలు నవ్వడమూ నిషేధమే. తెలుపు రంగు బట్టల మీద, గోళ్ల రంగు మీద నిషేధం విధించారు. పైగా ఆడపిల్లలకు చిన్నవయసులోనే పెళ్లిళ్లు చేసేవారు. టీనేజర్ అయ్యాక కూడా బురఖా వేసుకునేది కాదు. దాంతో బంధువుల్లో కోపం వుండేది. ఇక తాలిబన్ల సంగతి సరేసరి.

ఇటువంటి ఆంక్షల రాజ్యంలో హక్కుల కోసం ఎలుగెత్తి నినదించడం చిన్న విషయం కాదు. అలాంటిది చిన్నారుల సంగతి సరేసరి. తాలిబన్ల ఆటవిక రాజ్యంలో బాలల హక్కులకై గళం విప్పింది మలాలా. తుపాకులు, బాంబులతో విరుచుకుపడే శత్రువుతో కలంతో, గళంతో తలపడింది. మతోన్మాదుల కారణంగా అక్షరాలకు దూరమైన చిన్నారుల గళమైంది.

'గుల్ మఖాయ్' బ్లాగ్

స్వాత్ ప్రాంతంలో ... మతం పేర తాలిబన్లు విధించిన అనేకానేక ఆంక్షల్లో... ఆడపిల్లలు చదువుకోకూడదన్నది ఒకటి. నాలుగొందల పాఠశాలలను మూసివేశారు. మరీ ముఖ్యంగా బాలికల పాఠశాలలను బాంబులతో ధ్వంసం చేశారు. మలాలా సొంత గ్రామంలో సైతం స్కూలు బోర్డులన్నీ మాయమయ్యాయి. బయటి నుంచి చూసేవారికి అక్కడ స్కూలు వుందన్న విషయమే తెలియదు. తండ్రి స్థాపించిన కుషాల్ స్కూల్లో చదువుకునేదామె. స్కూలు యూనిఫారంలో బడికెళ్తుంటే తాలిబన్లకు తెలుస్తుందని సాధారణ బట్టల్లోనే వెళ్లేవారు. ఆకాశంలోంచి దూసుకెళ్లే తాలిబన్ల విమానాలు, సుదూరంగా విన్పించే తుపాకుల చప్పుళ్ల మధ్య బడికెళ్లాల్సి వచ్చేది చిన్నారులు. కొంతకాలానికి ఆ మాత్రం అక్షర జ్ఞానం అందుకునే అవకాశం కూడా కరవైంది. ఆ ప్రాంతమే ఖాళీ చేయాల్సి వచ్చింది. ఘర్షణలు చల్లారాక తిరిగి సొంత ఊరికి చేరుకునే సరికి అంతా విధ్వంసమే. ఈ ప్రమాదకర పరిస్థితుల్లో... తండ్రితోపాటు పెషావర్ వెళ్లిన మలాలా తొలిసారిగా బహిరంగంగా మాట్లాడింది. 'బడికెళ్లడం నా ప్రాథమిక హక్కు. దాన్ని కాదనే ధైర్యం తాలిబన్లకు ఎవరిచ్చారు?' అని ప్రశ్నించింది. పాకిస్తాన్‌లో ఇది పెద్ద సంచలనమే అయ్యింది. ఇదే కాదు ఆ తర్వాత ... టీవీ ఇంటర్వ్యూల్లోనూ ధైర్యంగా ఆడపిల్లల విద్యా హక్కు గురించి మాట్లాడింది.

2009లో తాలిబన్లకు పాక్ సైన్యానికి మధ్య యుద్ధం నడిచింది. ఆ సమయంలో సామాన్యులు పడుతున్న కష్టాలను, ఎదుర్కొంటున్న సమస్యలను గురించి రాయగలిగిన చిన్నారులను వెతికిపెట్టమని 'బి.బి.సి ఉర్దూ వెబ్‌సైట్' వారు మలాలా తండ్రిని అడిగారు. ఆయన తమ స్కూల్లో రచనాశక్తి కలిగిన పదవ తరగతి పిల్లాణ్ణి పరిచయం చేశాడు. అయితే పెద్దల ఒత్తిడి మేరకు ఆ మరునాటి ఉదయాన్నే వచ్చి తను రాయలేనన్నాడు. దాంతో తన కుమార్తెనే రాయమని ప్రోత్సహించాడు. అలా 'గుల్ మఖాయ్' (జొన్న పువ్వు) అన్న కలం పేరుతో డైరీలా రాసింది మలాలా. తను చూసిన విషయాలనే చిన్న చిన్న వాక్యాలుగా రాసేది. ప్రశ్నించేది. తిరగబడేది. ఇది పాకిస్తాన్‌లో పెద్ద చర్చకే దారితీసింది. జనవరి 3, 2009న మలాలా రాసిన బ్లాగులో ఏముందో చూద్దాం.

"అమ్మ నాకోసం అల్పాహారం తయారుచేసింది. స్కూలుకెళ్లడానికి భయం వేసింది. కారణం! ఆడపిల్లలు పాఠశాలలకు వెళ్లకూడదని తాలిబన్లు ఫత్వా విధించారు. ఆరోజున మొత్తం 27 మందికి కేవలం 11 మంది మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. తాలిబన్ శాసనం చేసిన తర్వాత ... నా ముగ్గురు స్నేహితురాళ్లు కుటుంబాలతో సహా పెషావర్, లాహోర్, రావల్పిండి వెళ్లిపోయారు".

పాఠశాల విద్యార్థిని డైరీ రాసుకున్నంత సహజంగా ఎంత బాగా రాసింది మలాలా! తర్వాత ఆ వార్తలు రాసింది తనేనని బహిరంగంగా ప్రకటించింది కూడా. దాంతో తాలిబన్ల దృష్టి మలాలా మీద పడింది.

ఆస్పత్రిలో కుటుంబ సభ్యులతో మలాలా

కలల్లోనూ తాలిబన్లే

బ్లాగు రాతలు, బహిరంగ ప్రదేశాల్లో ఆమె ఉపన్యాసాలు, టీవీ ఇంటర్వ్యూలు... చూసిన తాలిబన్లు రెచ్చిపోయారు. పత్రికల్లో వార్తల రూపంలో వారి నుంచి బెదిరింపులు వచ్చేవి. గుర్తు తెలియని వ్యక్తులు చిన్న చిన్న చీటీల మీద బెదిరింపులు రాసి ఆమె మీద విసిరేవారు. మలాలా తండ్రి కూడా తాలిబన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేసేవారు. దాంతో ఆయన స్నేహితుణ్ణి పొట్టన పెట్టుకున్నారు తాలిబన్లు. 'ఇక నీ వంతే. జాగ్రత్తగా వుండు' అని తండ్రిని అప్రమత్తం చేసే బంధుమిత్రుల మాటలు విన్నప్పుడు బాధపడిపోయేది మలాలా. ఈ ఘటనల నేపథ్యంలో ఆమెను స్కూలుకు నడిచి వెళ్లనిచ్చేది కాదు తల్లి. బస్సులోనే వెళ్లమనేది. అయితే స్కూలు బస్సు ఇంటి వరకు వచ్చేది కాదు. వీధి చివరనే ఆపేసేవారు. అక్కడి నుంచి ఇంటివరకు నడిచిరావాల్సి వచ్చేది ఎవరైనా తన మీద దాడి చేస్తే...అప్పుడే చేస్తారనుకునేది.

చిన్నారి కలల్లో సైతం వదిలేవారు కాదు తాలిబన్లు. తను వీధిలో నడుచుకుంటూ వస్తుంటే హఠాత్తుగా ఒక టెర్రరిస్టు మీదకు దూకి కాల్చేసినట్టు కలలు కనేది. అప్పుడు ఏం చేయాలని ఆలోచించేది. కాలి చెప్పు తీసి ఆ టెర్రరిస్టును కొట్టాలనుకునేది. కానీ అలా చేస్తే తీవ్రవాదికి తనకు తేడా ఏం వుందనుకునేది మళ్లీ తనే. 'నన్ను కాల్చు. కానీ నేను చెప్పేది విను. నువ్వు చేస్తున్నది తప్పు. నాకు నీకు ఎలాంటి శత్రుత్వం లేదు. ప్రతి అమ్మాయి స్కూలుకు వెళ్లాలని నేను కోరుకుంటున్నా. అంతకు మించి నాకేం తెలియదు' అని ప్రార్థించాలని అనిపించేదామెకు.

ఆ సమాజంలో అమ్మాయిలు అయితే టీచర్లు, లేకపోతే డాక్టర్లు కావాలి. ఇతర వృత్తుల్లో చేరడానికి అవకాశమే లేదు. ఫ్యాషన్ డిజైనర్ కావాలని వున్నా, రాజకీయవేత్త కావాలని వున్నా... పైకి చెప్పగలిగే సాహసం చేసేవారు కాదు అమ్మాయిలు. మలాలా సైతం మొదట డాక్టర్ కావాలని కలలు కంది. తర్వాత సైంటిస్ట్ కావాలనుకుంది. ఆ తర్వాత రాజకీయాల్లోకి వెళ్లాలనుకుంది. అయితే అది చెప్పే అవకాశం వస్తుందనుకోలా.

తూటాలకు వెరవని సాహసి

మలాలా, ఆమె కుటుంబం భయపడినట్టే జరిగింది. సరిగ్గా రెండేళ్ల కిందట ... అక్టోబర్ తొమ్మిదవ తేదీ. ఎప్పటిలాగే ఆరోజు స్కూలు బస్సులో స్నేహితులతో కలిసి బయల్దేరింది మలాలా. పేరుకి బస్సేగాని...నిజానికి అది

టయోటా ట్రక్కు. అన్ని వైపులా మూసి వుండేది. బైటికి చూడ్డానికి వుండేది కాదు. బస్సు మలుపు తిరిగిందన్న విషయం మాత్రమే తనకు తెలుసు. ఈలోగా హఠాత్తుగా 'కుషాల్ స్కూలు బస్సు ఇదేనా?' అన్న మాటలు వినిపించాయి. తర్వాత కొంతమది విద్యార్థుల వివరాలు కావాలన్న మాట వినపడింది. అనంతరం మొహానికి రుమాలు కట్టుకున్న కుర్రాడు 'మలాలా ఎవరు?' అనడగడం... తెలుసుకున్న వెంటనే మూడు సార్లు తుపాకీతో ఆమెను కాల్చడం... రక్తపు మడుగులో మలాలా ఒరిగిపోవడం లిప్తపాటులో జరిగిపోయింది. తన పదకొండవ ఏట నుంచే బాలికల హక్కులకోసం ఉద్యమించినందుకు తాలిబన్లు విధించిన శిక్ష అది. మలాలా ఎడమ కంటి లోపల, భుజం మీద, చెవి మీద ... తగిలాయి బుల్లెట్లు. పాక్ వైద్యులు వెనువెంటనే బుల్లెట్లను తొలగించారు. అందుకోసం పుర్రె భాగాన్ని తొలగించి ... టైటానియం ప్లేటును అమర్చాల్సి వచ్చింది. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి అరబ్ ఎమిరేట్స్‌కు... అనంతరం లండన్ క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రికి చేర్చారు మలాలాను. అక్కడ అందించిన వైద్యంతో నాలుగైదు నెలలకే లేచి కూర్చోగలిగింది.



కోలుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ...మలాలా ఏమన్నదో తెల్సా! "నాకు పునర్జన్మ లభించింది. నాకు ప్రజాసేవ చేయాలనుంది. ప్రతి అమ్మాయి, అబ్బాయి చదువుకోవాలని కోరుకుంటున్నారు. ఆ ఆశయంతోనే మేం 'మలాలా ఫండ్'ను ఏర్పాటు చేశాం. అవసరమైతే నేను బలిదానానికి సిద్ధంగా వున్నాను. పాకిస్తాన్‌లో విద్యాభివృద్ధికి ఏదైతే అవసరమో అది చేయడానికి సిద్ధంగా వున్నాను. నా కోరిక ఒకటే ప్రతి బిడ్డా చదువుకోవాలి. మన దేశంలో... మొత్తం ప్రపంచంలో శాంతి నెలకొల్పాలి. శాంతి కోసం నన్ను నేను బలిదానమిచ్చుకుంటాను" అని చెప్పిందా చిన్నారి. అప్పుడు కూడా తాలిబన్లు ఆమెను విడిచిపెట్టలేదు. ప్రపంచం అంతా ఆమె ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేస్తున్న సమయంలో... ఆమెకు మరణశిక్షే సరైనదని ప్రకటించారా తాలిబన్ కర్కోటకులు. దాంతో పాకిస్తాన్ తిరిగి వెళ్లలేకపోయిందా కుటుంబం. బర్మింగ్ హామ్‌లోనే... పాకిస్తాన్‌కు ఐదుగంటల ప్రయాణపు దూరంలో... స్థిరపడ్డారు. అక్కడే స్థానిక పాఠశాలలో చేరి తిరిగి విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్న మలాలా ప్రపంచ మహిళల విద్యాహక్కుకై పోరాటం మొదలెట్టింది. ఈ ఘటనతో మలాలా అత్యంత సాహసిగా ప్రపంచ గుర్తింపు పొందింది.

మలాలా రోజు

జులై 12 మలాలా పుట్టిన తేదీ. గత సంవత్సరం ఆ రోజును 'మలాలా డే'గా ప్రకటించింది ఐక్యరాజ్యసమితి. ఆరోజు మలాలా వందలాదిమందిని ఉద్దేశించి ప్రసంగించింది. "ప్రియమైన మిత్రులారా! వారు భావించవచ్చు... తూటాలకు భయపడి మనం మౌనంగా వుంటామని. కాని వారనుకున్నది సాధించలేకపోయారు. ... నాలో ఏం మార్పు రాలేదు. నాలో విశ్వాసం ఇంకా పెరిగింది. భయం అనేది పూర్తిగా పోయింది. నాలో శక్తి సామర్థ్యాలు మరింత పెరిగాయి. నేను అప్పటి మలాలానే. నా కోరికలు, ఆకాంక్షలు కూడా గతంలోనివే. నేను ఎవ్వరికీ వ్యతిరేకం కాదు. నాపై కాల్పులు జరిపిన తాలిబన్ల మీద కూడా నాకు ద్వేషం లేదు. అతను ఎదురుగా నిలబడినా .. నా చేతిలో తుపాకీ వున్నా కాల్చను... పేదరికం, అజ్ఞానం, తీవ్రవాదంపై పోరాటం ప్రకటిద్దాం రండి. ... ప్రపంచాన్ని మార్చడానికి పెన్నూ, పుస్తకం, విద్యార్థీ, ఉపాధ్యాయుడూ వుంటే చాలు. అన్నిటికీ చదువు ఒక్కటే ఉపాయం. అన్నిటికంటే చదువే ప్రధానం...' అని చెప్పిందా చిన్నారి. విద్యతోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొంది.

నేను మలాలాను

'ఐ యామ్ మలాలా' (నేను మలాలాను) పేరుతో తన ఆత్మకథను ప్రపంచం ముందుంచింది పదిహేడేళ్ల సాహస బాలిక మలాలా. స్వాత్ అమ్మాయిగా తన గురించి, తన అందమైన లోయ గురించే కాదు. అక్కడ తిష్టవేసిన మానవమృగాల్లాంటి తాలిబన్ల వికృత పాలననూ కళ్లకు కట్టిందీ పుస్తకంలో. తను ఎలా పోరుబాట పట్టింది.. తిరుగుబాటు చేసింది చక్కగా వివరించింది. భయం గుప్పెట్లో పాక్ ప్రజలు రోజులు వెళ్లదీసిన విధానాన్ని చిత్రీకరించింది. తనను వెంటాడిన తాలిబన్ క్రూరత్వాన్ని, వెన్ను తట్టిన ప్రపంచాన్ని, ఫలించిన వారి ఆశీస్సులను, సాకారమైన తన కలను... అన్నిటినీ ...పూర్తిగా చెప్పుందీ పుస్తకంలో. ఇప్పటికి ఆంగ్లంలోనే కాక పలు ప్రాంతీయ భాషల్లోను అందుబాటులోకి వచ్చింది.

బాలికల విద్యా హక్కు కోసం తూటాలకు వెరవని... వెన్ను చూపని బాల యోధురాలిని వరించిన పురస్కారాలెన్నో. అందిన సన్మానాలెన్నో. అంతర్జాతీయ బాలల శాంతి పురస్కారం, పాకిస్తాన్‌కు చెందిన యువశాంతి పురస్కారం, మదర్ థెరిస్సా మెమోరియల్ అవార్డు, సీమాన్ డి బహ్‌వాయిర్ పురస్కారం, టిప్పరీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డుతో పాటు అనేక ఆమె అనేక సన్మానాలు అందుకుంది. ఇక దాడికి గురైన రెండేళ్లకు నోబెల్ శాంతి బహుమతినే దక్కించుకున్న విషయం తెల్సిందే. ప్రపంచాన్ని ప్రభావితం చేసిన పాతిక మంది టీనేజర్లలో మలాలా ఒకరుగా ప్రకటించింది 'టైమ్' పత్రిక.

★★★

బాలల కోసం.. హక్కుల కోసం..

కొత్త బట్టలు, నుదుటిన తిలకం, భుజాన సంచితో కళకళ లాడుతూ స్కూలుకెళ్లాడా చిన్నారి. స్కూల్లో చేరే రోజు కావడంతో వెంట నాన్న కూడా వున్నాడు. స్కూలు భవనం ఎదురుగా చెప్పులు కుడుతున్న వ్యక్తి, అతని కొడుకు (సరిగ్గా తన వయసు పిల్లాడే) బాగా ఆకట్టుకున్నారు. ఆ పిల్లవాడు తన తండ్రితో కూర్చుని చెప్పులు కుడుతూ దీనంగా తన వంక చూసిన చూపులు ఎందుకో మర్చిపోలేకపోయాడు. అదే రోజున ఆ చెప్పులు కుట్టే వ్యక్తి దగ్గరకెళ్లి ... బాబు బడికి ఎందుకు రావడం లేదని అడిగాడు అమాయకంగా. 'మా నాన్న ఇదే పనిచేశాడు. నేనూ ఇదే చేస్తున్నాను. నా కొడుకూ ఇదే చేస్తాడు...మేం పని కోసమే పుట్టాం...' అన్న సమాధానం ఆ చిన్నారిని ఆలోచనలో పడవేసింది. మధ్యప్రదేశ్‌లోని 'విదిశ'కు చెందిన ఆ పిల్లవాడే ఈ ఏటి నోబెల్ శాంతి పురస్కారం అందుకోబోతున్న బాలల హక్కుల నేత కైలాశ్ సత్యార్థి. వెట్టి చాకిరి నుంచి బాలలను విముక్తి కల్పించి వారిని చదువుల దిశగా నడిపించాలన్న దీక్షకు ఆ సంఘటనే పెద్ద స్ఫూర్తి అంటారాయన.

ఉద్యోగం వదులుకొని... ఉద్యమం చేపట్టి...

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పట్టా, ఉపాధ్యాయ వృత్తిని పక్కన పెట్టి బాలకార్మికుల విముక్తికోసం నడుం కట్టారు కైలాశ్ సత్యార్థి. బాలల హక్కుల కోసం బాల్యం నుంచి తపించేవారు. దేశవ్యాప్తంగా దాదాపు ఐదు కోట్ల మంది చిన్నారులు బాలకార్మికులుగా పని చేస్తున్నారన్నది ఆయన ఆందోళన. ఇందులో కోటిమంది వెట్టిచాకిరీ వ్యవస్థలో మగ్గుతున్నారని, వీరిలో యాభై లక్షల మంది చిన్నారులు ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించబడుతున్నారంటారు కైలాష్.

బానిసత్వంలో మగ్గిపోతున్న పిల్లలను విడిపించేందుకు నేరుగా వెళ్లి సంస్థల యాజమాన్యాలతో తలపడడం కాకుండా... చట్టాన్ని న్యాయాన్ని ఆశ్రయించడం, తల్లిదండ్రుల్లో మార్పును తీసుకురావడం, సమాజానికి బాధ్యతను గుర్తు చేయడం, బాలలను కార్మికులుగా వినియోగిస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై ఒత్తిడి తేవడం ...వంటి ఎన్నో మార్గాల్లో తన గమ్యం చేరే



పిల్లలతో సత్యార్థి

ప్రయత్నం చేస్తున్నారు.

బచ్‌పన్ బచావ్ ఆందోళన్

1980లో 'బచ్‌పన్ బచావో ఆందోళన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు సత్యార్థి. కేవలం చిన్నారుల హక్కుల కోసమే సుదీర్ఘంగా పనిచేస్తున్నారు. ఒక్క భారత్‌లోనే కాదు. పాకిస్తాన్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా వంటి 144 దేశాల్లో సైతం అదే స్ఫూర్తితో పనిచేశాడు. ఇప్పటికి 80,000 మంది బాలకార్మికులను వెట్టి చాకిరి నుంచి, అక్రమ తరలింపుల నుంచి, దానవుల్లాంటి మానవుల క్రౌర్యం నుంచి, చీకటి కౌగిలి నుంచి విముక్తి కల్పించారు. అంతటితో ఆగకుండా వారికి విద్య కూడా అందించాలన్నది ఆయన లక్ష్యం. అందుకోసం 'బాల మిత్ర గ్రామ్' కార్యక్రమాన్ని చేపట్టారు. వెట్టి చాకిరి రహిత గ్రామాల రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తోంది. కైలాశ్ సత్యార్థి సాధించిన ముఖ్యమైన విజయాల్లో ఇదీ ఒకటి. ఇప్పటి వరకు 11 రాష్ట్రాలలోని 356 గ్రామాలను బాలమిత్ర గ్రామాలుగా రూపొందించారు. ఈ గ్రామాలలో 14 ఏళ్లలోపు బాలలకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తారు. డ్రాపవుట్ల ఊసే వుండదు. పైగా బాల్య వివాహాలు, ఆడపిల్లల పట్ల వివక్ష వంటివి లేకుండా గ్రామ సంఘాలు చొరవ చూపిస్తాయి.

'ఫ్యాక్టరీలలో చిన్నారులను చావగొట్టేవారు. ఎంతలా అంటే పిల్లలు తల్లిదండ్రుల కోసం ఏడిస్తే చావగొట్టేంత. మాట వినని పిల్లల్ని తలకిందులుగా చెట్లకు వేలాడదీసేవారు. ఇంకొందరు సిగరెట్లతో కాల్చి హింసించేవారు. ఈ సంఘటనలు నన్ను తీవ్రంగా కలచివేసేవి. వారికోసం 'బచపన్ బచావో ఆందోళన్' మొదలెట్టేవరకు కంటిమీద కునుకు లేదు' అని చెప్పారో ఇంటర్వ్యూలో. ఇప్పుడు బచపన్ బచావో దేశవ్యాప్తంగా నలుమూలలకూ విస్తరించింది. 750 స్వచ్ఛంద సంస్థలతో, వేలాది సభ్యులతో బాలల హక్కుల కోసం కృషి చేస్తోంది. అమెరికా, యూరప్ దేశాల్లో పిల్లల చేత తయారు చేయించిన కార్పెట్లను కొనుగోలు చేయకుండా వినియోగదార్లలో చైతన్యం తీసుకురాగలిగారు.

రగ్ మార్క్

దేశంలో బాలల హక్కులను గుర్తిస్తూ తయారైన అనేక చట్టాల వెనక సత్యార్థి కీలక పాత్ర వుంది. క్వారీలు, వజ్రాలు, అగ్గిపెట్టెలు, టపాకాయలు, రగ్గులు-తివాచీల నేత, బొగ్గు గనుల వంటి రంగాల్లో బాల కార్మికులను నిరాఘాటంగా, నిస్సిగ్గుగా వినియోగించడాన్ని ప్రతిఘటించారు కైలాశ్. ఉత్తరాదిన రగ్గులు తయారు చేసే పరిశ్రమలలో బాలల వెట్టి చాకిరి కబంధ హస్తాల నుంచి వేలాది మందికి విముక్తి కల్పించారు. ఉత్తరాదిన రగ్గులు తయారుచేసే పరిశ్రమలలో బాలల వెట్టి చాకిరి ఎక్కువ. ఇది గమనించిన రగ్‌మార్క్ పథకానికి రూపకల్పన చేశారు కైలాశ్. ఆయన కృషి ఫలితంగానే అనేక పరిశ్రమలలో ఉత్పత్తి అయిన రగ్గుల తయారీలో 'బాలల ప్రమేయం లేదు' అనే ట్యాగ్ తగిలించడం మొదలైంది. అయితే ఆ క్రమంలో హందియాలో బుల్లెట్ల దాడులనూ చవిచూడాల్సి వచ్చింది. కాల్పుల తర్వాత కూడా అక్కడి నుంచి వెళ్లిపోవడానికి నిరాకరించి...23 మంది పిల్లలను కాపాడారు.

బాల్యంలోనే బీజాలు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఇంతగా తపిస్తున్న సత్యార్థికి... ఈ బీజాలు బాల్యంలోనే పడ్డాయి. ఓసారి తమ పరీక్షా ఫలితాలను వెల్లడించారు ఉపాధ్యాయులు. ఉత్తీర్ణులైన విద్యార్థులంతా సంతోషంతో చిందులు వేస్తుంటే... కొందరు స్కూలు బయట నిలబడి ఆసక్తిగా గమనించడం చూశారు సత్యార్థి. వారు. పుస్తకాలు లేకనే ఎంతో మంది విద్యార్థులు పాఠశాలకు రాలేకపోతున్నారని తెలుసుకుని బాధపడ్డాడు. అయితే అంతటితో ఆగిపోలా! స్నేహితులతో కలిసి... సొంత ఊరిలో ఒక్క రోజులోనే 2 వేల పుస్తకాలు సేకరించాడు అయితే కె.జి నుంచి పి.జి వరకు ఉపయోగపడే పుస్తకాలున్నాయి వాటిలో. వాటిని ఎలా పంపిణీ చేయాలో సత్యార్థి మిత్రబృందానికి అర్థం కాలేదు. వెంటనే స్కూలు ప్రిన్సిపాల్ సాయం అడిగారు. ఆయనే ముందుండి... పుస్తకాలను విడగొట్టి... అవసరమైన విద్యార్థులకు అందించే పనిని భుజాన వేసుకున్నారు. అదే మెల్లగా 'బుక్ బ్యాంక్'గా మారింది. అయితే ఫీజులు కట్టలేక స్కూళ్లకు రాలేని పిల్లల గురించి తెలుసుకుని మరో ఆలోచన చేశాడు. కొంతమంది దాతలను కూడగట్టి 'ఫుట్‌బాల్ క్లబ్బు' స్థాపించాడు. నిధులను పోగు చెయ్యడం ద్వారా పేద పిల్లలకు చదువు చెప్పించే పని పెట్టుకున్నాడు. ఆ దశలోనే బాలకార్మికుల తరలింపు, వెట్టి, నిరుద్యోగం, నిరక్షరాస్యత గురించి తెలుసుకున్నా... పోరాటాన్ని విస్తృతం చేశానని చెప్తారు కైలాశ్ సత్యార్థి.

కుటుంబ మద్దతుతోనే...

ఈ విధమైన పోరాటాలు చేయడానికి కుటుంబం నుంచి అందే అండ, మద్దతు మాటల్లో చెప్పలేనిదంటారు సత్యార్థి. ఇంజనీరింగ్ పట్టాను విడిచిపెట్టి బాలకార్మికోద్యమం చేపట్టినప్పుడు తల్లి విలపించింది. అయితే ఆ తర్వాత అతని పోరాటాన్ని అర్థం చేసుకొని ప్రోత్సహించింది. విజయం

సత్యార్థి కూతురు, భార్య

సాధించిన ప్రతి పురుషుడి వెనక ఒక స్త్రీ వుంటుందంటారు. కైలాశ్‌కి అండగా నిలిచింది సహచరి సుమేధ. భర్తను ప్రేమగా 'సాబ్జీ' అంటారీమె. ఆయనగారు ఈమెను 'దేవీజీ' అంటారు అనురాగంతో. వీరు తమ ఉద్యమాలకు మద్దతుగా 'సంఘర్ష్ జరి రహేగా' అనే ప్రచురణా సంస్థనూ స్థాపించారు. తొలి దశలో వారు మింటో రోడ్‌లోని ఒక చిన్న అద్దె గదిలో మొదలైంది. సుమేధ కూడా తరచుగా భర్త పోరాటాల్లో పాల్గొనేది. వీరి కుమారుడు కూడా ఇదే ఉద్యమంలో కొనసాగుతున్నాడు. కుమార్తె సైతం టపాసులు తయారు చేసే పిల్లల హక్కులకోసం చేసిన ప్రచారంలో పాల్గొంది. జంతు ప్రేమికుడు అయిన సత్యార్థ్ తన అందమైన కుటుంబంలో ఓ శునకాన్ని కూడా సభ్యురాలిని చేశాడు. దాన్ని తన మూడవ బిడ్డగా చెప్తుంటాడు.

దాడులకు వెరవలా

బాల కార్మికులు ఎక్కడున్నారో తెలుసుకొని దాడులు జరపడం, వారిని గుర్తించడం, వారిని విముక్తులను చేయడం, చదువులు చెప్పించడం, పునరావాసం కల్పించడం ... ఇలా సాగుతుంది ఆందోళన్. ఆ సందర్భాలలో యాజమాన్యాల నుంచి ఎన్నో దాడులను ఎదుర్కొన్నారు. అవన్నీ తమకు పరీక్షల వంటివంటారు కైలాశ్. వాటిలో ఉత్తీర్ణులై ఈ దురాగతాలకు వ్యతిరేకంగా నిలబడగలగాలంటారు. 2011 మార్చి 17న ఢిల్లీలోని ఒక వస్త్ర విక్రయ శాల నుంచి బాలకార్మికులను విడిపించిన సత్యార్థిపై హత్యాయత్నం జరిగింది. గ్రేట్ రోమన్ సర్కస్‌లో వెట్టిచాకిరిలో మగ్గిపోతున్న అనేక వేల మంది చిన్నారులను విముక్తి చేసేందుకై ప్రయత్నించగా... కంపెనీ యజమానులు కైలాశ్‌పై దాడి చేశారు. ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇక ఫోన్లలో వచ్చే బెదిరింపు కాల్స్ తక్కువేం కాదు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సత్యార్థి చేసిన కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు వరించాయి. ఎన్నో అవార్డులు అందుకున్నారు. తాజాగా వరించిన నోబెల్ శాంతి పురస్కారం సంగతి తెల్సిందే.

ఓ భారతీయుడికి నోబెల్ బహుమతి లభించడంతో సంతోషించని వారు లేరు. దేశం యావత్తూ పొంగిపోయింది. మీడియా సైతం కథనాలు ప్రచురించింది. ప్రచురిస్తోంది కూడా. ఒక విషయాన్ని మనం మరువకూడదు. ప్రధానంగా ఆడపిల్లల విద్యాహక్కుకోసం ... బాల కార్మిక వ్యవస్థ నుంచి చిన్నారుల విముక్తికై కృషి చేస్తున్న కారణంగా వీరికి నోబెల్ వరించింది. అవార్డు గ్రహీతలను అభినందిస్తూనే... మనం ఏ పరిస్థితుల్లో వున్నామో గుర్తుచేసుకోవాలి. ఈ తరుణంలో అమాయక, నిస్సహాయ బాలల హక్కులకై ప్రభుత్వాలు చొరవ చూపాలి.

★

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ

◆ సీరియల్

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

" ఇప్పుడు మార్క్స్ మళ్లీ నిరుద్యోగి. సంపాదన లేదు. రాబోయే అనేక దశాబ్దాలలో ఆయన పరిస్థితి ఇలాగే ఉండబోతోంది. సమాజ నిర్మాణంలోని ఆర్థిక మూలాలను ఆయన నిరూపించిన మాట నిజమేగాని, స్వంత జమా ఖర్చుల విషయానికొచ్చేటప్పటికి చాలా బాధ్యతారహితంగా వ్యవహరించాడు (బహుశా ఈ బలహీనత తెలిసే, పెళ్లికి ముందు మార్క్స్ చేసిన అప్పలకు జెన్నీ బాధ్యత లేదని, ఆమె కుటుంబం, అతని నుండి ఒక హామీ పత్రం రాయించుకుంది). తల్లి నుండి డబ్బు రాబట్టటంలో విఫలమై, తన అంకుల్ లయన్ ఫిలిప్‌ను కలసి తనకు సంక్రమించబోయే ఆస్తిపాస్తుల గురించి తెలుసుకోవటానికి హాలాండ్ వెళ్లాడు మార్క్స్. "

జెన్నీ, ఆమె తల్లితో కలిసి క్రిస్మస్ జరుపుకోవటానికి డిసెంబర్‌లో క్రూజ్‌నాచ్‌కు బయల్దేరాడు మార్క్స్. ఇప్పుడు పరిస్థితి కాస్త మెరుగ్గానే వుంది. ఉదారవాద మేధావుల మధ్య గౌరవం పెరిగింది. ఆదాయం కూడా పరవాలేదు. ఒకచోట నిలకడగా ఉంటున్నాడు. ఇక పెళ్లి చేసుకోవచ్చు. జూన్‌లో ఆ తంతు ముగిద్దామనుకున్నారు ప్రేమికులు. కాని మార్క్స్ కొలోన్ తిరిగి వచ్చేసరికి 'రైనిష్ జైటుంగ్'ని నిషేధించింది ప్రభుత్వం. దాన్ని ప్రచురించటానికి అనుమతి లేదు. నిషిద్ధ భావాలను ప్రచారం చేస్తున్నది. అది అసలు చట్ట వ్యతిరేక ప్రచురణ అన్నది అభియోగం.

ఆ పత్రిక ప్రారంభమైన రోజునుండీ రైన్‌లాండ్, బెర్లిన్ ప్రభుత్వాలకు కంటిలో నలుసుగానే వుంది. నవంబర్‌లోనే నిషేధం విధిద్దామనుకున్నారు. కానీ, జనవరి 4, 1843 నాడు జార్ నికోలస్-1ను విమర్శిస్తూ ఓ ఆర్టికల్ ప్రచురించటంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి వచ్చింది. ప్రష్యన్ రాయబారి, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జార్‌తో భేటీ అయినప్పుడు. ఉదారవాద పత్రికలకు కళ్లెం వెయ్యమని రాయబారిని కోరాడు జార్. జనవరి 21 నాడు, తన మంత్రులతో సమావేశమైన ఫ్రీడ్రిక్ విల్హెమ్.. పత్రికను నిషేధించాలని నిర్ణయించాడు (మార్చి 1843 దాకా పత్రికను నడపవచ్చునని అనుమతి వుంది. కానీ ఇద్దరు సెన్సారు అధికారులు దాని మీద నిఘా పెడతారు).

అయినప్పటికీ, 17 నాడే తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు మార్క్స్. కనీసం తన నిష్క్రమణ అయినా పత్రికను నిలబెడుతుందని ఆశ. (కానీ ఆశ, అడియాసగానే మిగిలింది. 'రైనిష్ జైటుంగ్' మార్చి 31 నాడే మూతబడింది.) పత్రికతో తన సంబంధాన్ని తెంచుకోవాలనుకున్న మార్క్స్, 'పత్రికలో నేనుండలేని పరిస్థితి ఏర్పడింది. స్వేచ్ఛ కోసమైనా సరే, అన్ని నీచమైన పనులు చెయ్యనక్కర్లేదు. ఆయుధాలతో యుద్ధం చేసుకోవటం బాగుంటుంది గాని సూటిపోటి మాటల్ని భరించటం కష్టం. హిపోక్రసీ, మూర్ఖత్వం, 'ఇష్టం వచ్చినట్టుగా చేస్తాను అనే తనం', పనులు వాయిదా వేస్తూ పోవటం, ప్రతి పదం గురించీ, కోడిగుడ్డుకు ఈకలు పీకటం ఎక్కువైంది.

ఇవన్నీ ఇక నేను భరించలేను... ప్రభుత్వమే నాకు స్వేచ్ఛను ప్రసాదించింది" అంటూ రూగ్‌కో లేఖ రాశాడు.

క్రూజ్‌నాచ్, 1843

ఇప్పుడు మార్క్స్ మళ్లీ నిరుద్యోగి. సంపాదన లేదు. రాబోయే అనేక దశాబ్దాలలో ఆయన పరిస్థితి ఇలాగే ఉండబోతోంది. సమాజ నిర్మాణంలోని ఆర్థిక మూలాలను ఆయన నిరూపించిన మాట నిజమేగాని, స్వంత జమా ఖర్చుల విషయానికొచ్చేటప్పటికి చాలా బాధ్యతారహితంగా వ్యవహరించాడు (బహుశా ఈ బలహీనత తెలిసే, పెళ్లికి ముందు మార్క్స్ చేసిన అప్పులకు జెన్నీ బాధ్యత లేదని, ఆమె కుటుంబం, అతని నుండి ఒక హామీ పత్రం రాయించుకుంది).

తల్లి నుండి డబ్బు రాబట్టటంలో విఫలమై, తన అంకుల్ లయన్ ఫిలిప్‌ను కలసి తనకు సంక్రమించబోయే ఆస్తిపాస్తుల గురించి తెలుసుకోవటానికి హాలాండ్ వెళ్లాడు మార్క్స్. ఈ విషయమై స్పష్టమైన ఆధారాలేవీ లభ్యం కావటం లేదుగాని ఫిలిప్ బాగానే ఆదుకున్నట్టుంది. ఆ తర్వాత ఒక సంవత్సరంపాటు మార్క్స్ నిశ్చింతగా బతికాడు. కొలోన్‌లో చేసిన ఉద్యోగం నుండి ఏమీ మిగుల్చుకునే అవకాశం లేదు. అంటే ఏడాది ఖర్చు ఫిలిప్ పుణ్యమే.

ఈ కాలంలోనే, మార్క్స్, రూగ్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించాడు. ఫ్రాన్సు కేంద్రంగా కొత్త పత్రిక 'జర్మన్ – ఫ్రెంచి ఇయర్ బుక్' పత్రికను ప్రారంభించటానికి సన్నాహాలు చేసుకుంటున్నాడు రూగ్. కొత్త పత్రిక గురించి మార్క్స్ చాలా ఉత్సాహంగా ఉన్నాడుగాని జెన్నీ ఆందోళన చెందింది. ఒకసారి జర్మనీ వదిలి ఫ్రాన్సు వెళితే, అతణ్ణి తిరిగి దేశంలోకి అనుమతించే అవకాశం లేదు.

అయితే, ఈ సమయంలోనే జర్మనీలో కొనసాగటానికి అతనికి రెండు అవకాశాలు వచ్చాయి. బెర్లిన్‌లోని కోర్టు అధికారి ఒకరు ఒక ప్రభుత్వోద్యోగంలో చేరమన్నారు. బహుశా మరొకటి, ఫెర్డినాండ్ నుండి అయ్యుంటుంది. తనకు కాబోయే బావమరిదిని, జెన్నీకి చేరువలో ఉంచటానికీ, (ఎంగేజ్‌మెంట్ ఎలాగూ రద్దు చేయలేకపోయాడు!) అతడి మీద ఓ కన్నేసి

Rheinische Zeitung für Politik, Handel und Gewerbe.
№ 289 Köln, Sonntag den 16. Oktober 1842

రైనిష్ జైటుంగ్ పత్రిక

"కాని దంపతుల ఆలోచనలు ఆకాశంలో విహరిస్తున్నాయి. డబ్బుంటే ఎంత, లేకపోతే ఎంత- మార్క్స్ ట్రంకు పెట్టెల్లో ఉన్న పెన్నిధితో పోల్చితే. హనీమూన్ కాలంలో చదవటానికి వెంట తీసుకెళ్లిన నలభై అయిదు మహా గ్రంథాలు - హెగెల్, రూసో, మాకియవెల్లి, షమాబ్రియా ...వగైరా. జెన్నీ ప్రేమలో స్థిమితపడ్డ మార్క్స్, కేవలం పుస్తక పఠనం మాత్రమే కాదు, తాను కొలోన్‌లో నేర్చుకున్న రాజకీయ, ఆర్థిక పాఠాలను పున:పరిశీలించి కొత్త ఆలోచనలకు పదును పెట్టాడు. వాళ్ల వివాహం పరస్పర విశ్వాసానికి, అంకిత భావానికి ప్రతీక. ఆమె ప్రేమ అతని మేధో జ్వాలను రగిలించింది. మొత్తం మీద మార్క్స్ హనీమూన్ అధ్యయనం రెండు ముఖ్యమైన ప్రకటనలకు దారితీసింది. ఒకటి : 'మతం ప్రజలకు మత్తు మందు' అన్నది. రెండు : మానవజాతి విముక్తికి దారి చూపేది కార్మికవర్గమే."

వుంచటానికే మరో ప్రభుత్వోద్యోగం ఆఫర్ చేశాడు. కానీ రెండింటినీ నిరాకరించాడు మార్క్స్.

జర్మనీ సరిహద్దులు రావటమే మేలని భావించాడు మార్క్స్. ఏ ఆంక్షలు ఒత్తిడి లేకుండా, నిష్పాక్షికంగా, నిజాయితీగా పత్రిక నడపాలంటే మరో దేశం పోవాల్సిందే. రూగ్‌నూ, ప్రచురణకర్త ప్రొఫెసర్ జూలియస్ ఫ్రోబెల్‌ను కలవటానికి మే నెలలో డ్రెస్డెన్‌కు బయల్దేరాడు మార్క్స్. వీళ్లిద్దరూ డబ్బు పెడతారు. తను సహ సంపాదకుడిగా ఉంటాడు. కొలోన్‌లో ఇచ్చినంత జీతం ఇస్తారు. అదనంగా అందులో సగం రాయల్టీల రూపంలో. ఈ ప్రతిపాదనకు అంగీకరించాడు మార్క్స్. క్రూజ్‌నాచ్ వెళ్లి ఆర్టికల్స్ తయారుచేసి రెడీగా పెట్టుకుంటాడు. ఈ సందర్భంగా రూగ్‌కు వ్యక్తిగత విషయాలను గురించి ఓ లేఖ రాశాడు. నిజానికి ఇలా రాయటం అతని స్వభావం కాదు.

'నిర్మోహమాటంగా చెబుతున్నాను. నేను ప్రేమలో పీకల్దాకా కూరుకుపోయి వున్నాను – చాలా సీరియస్‌గా. మా ఇద్దరికీ ఏడేళ్ల క్రితం ఎంగేజ్‌మెంట్ అయింది. నాకోసం నా ప్రియురాలు ఎన్నెన్ని భయంకరమైన యుద్ధాలు చేసిందో! ఫలితంగా ఆమె ఆరోగ్యం కూడా పాడైంది. ఒకవైపు ఆమె అరిస్టోక్రాటిక్ బంధువుల నుండి వ్యతిరేకత. పరలోకంలో వున్న దేవుడికీ, బెర్లిన్‌లో వున్న దేవుడి (బెర్లిన్‌లో వున్న దేవుడంటే రాజుగారు) కీ మా సంబంధం ఇష్టం లేదు. అంతేనా, మా కుటుంబంలోని వాళ్లూ దీనికి వ్యతిరేకమే. అందరూ మాకు శత్రువులే'.

ఇంకా అనేక విషయాల గురించి ప్రస్తావించి, తామిద్దరూ 1836లో ఎంగేజ్‌మెంట్ అయిన రోజునుండీ పెళ్లి చేసుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉన్నామని స్పష్టం చేశాడు. నిజానికి ఈ పెళ్లికి అందరికన్నా ఎక్కువ అడ్డంకులు సృష్టించింది తనే తప్ప మరెవరూ కాదు. బాన్, బెర్లిన్, కొలోన్‌లకు ఒంటరిగా ప్రయాణించాడు. దీనివల్ల పెళ్లి ఆలస్యమౌతుందా, జెన్నీ ఒంటరితనంతో బాధ పడుతుందా అని ఆలోచించలేదు. ఆలస్యమైతే ఎంగేజ్‌మెంట్‌కే ప్రమాదమూ రావచ్చు. వివాహం ఎంత ఆలస్యమైనా ఓపికగా భరించింది జెన్నీ. ఆమె కార్ల్‌కు రాసిన లేఖల్లో ప్రేమ తప్ప తన ఆందోళన ఎక్కడా వ్యక్తం కాలేదు. పెళ్లికి ముందురోజుల్లో ఆమె 'నీతో ఎక్కడికైనా వస్తాను. నీకన్నా ముందే బయల్దేరి నీ దారుల్లో వున్న అడ్డంకుల్ని తొలగించి నీకు మార్గం సుగమం చేస్తాను. అదే నా ఆశయం' అంది కార్ల్‌తో.

'ఎదుటి మనిషితో మనం ప్రవర్తించే తీరునుబట్టే మనమేమిటో తెలుస్తుంది... అంటాడు' జర్మన్ తత్వవేత్త యోహాన్ గాట్‌లీబ్ ఫిష్టే. జెన్నీ, మార్క్స్‌ల ఒకరి ద్వారా ఒకరు తమ గురించి తెలుసుకున్నారు. జూన్ 19, 1843 నాడు ఎంగేజ్‌మెంట్ ముగిసింది. క్రూజ్‌నాచ్‌లోని ప్రొటెస్టెంట్ చర్చ్‌లో వివాహం చేసుకున్నారు. మార్క్స్ తరపున ఎవరూ హాజరు కాలేదు. జెన్నీవైపు నుండి ఆమె తల్లి, సోదరుడు ఎడ్గార్ మాత్రమే వచ్చారు. అప్పటికి

మార్క్సుకు ఇరవై అయిదు, జెన్నీకి ఇరవై తొమ్మిది.

కూతురికి, పెళ్లి కానుకగా శతాబ్దాల నాటి అతి విలువైన వెండి డిన్నర్ సెట్, ఖరీదైన బట్టలు, స్విట్జర్లాండులో హనీమూన్‌కు అవసరమైన ఖర్చులు ఇచ్చింది కారొలైన్. పెళ్లికి ముందు చాలా పొదుపు పాటించింది జెన్నీ. కార్ల్ ఏమీ కొనవద్దు. చివరికి, పెళ్లి డ్రెస్సు, పువ్వులు కూడా. డబ్బులు ఏమాత్రం వృధా చెయ్యకూడదన్నది తొలి నియమం. కానీ పెళ్లి తర్వాత, తొలి రోజుల్లో మార్క్సు దుబారా ఖర్చును అంగీకరించింది. కళ్ల ముందరే వున్న కొద్ది డబ్బూ కరిగిపోయింది. స్విట్జర్లాండ్ నుండి తిరిగి వస్తూ, దారిలో అనేక చోట్ల ఆగి మిత్రులతో గడిపాడు మార్క్సు. దగ్గరున్న డబ్బంతా ఒక స్ట్రాంగ్‌బాక్స్‌లో పెట్టడం అలవాటు. ఇంకేముంది? వచ్చిన మిత్రులకూ అది అందుబాటులోనే వుంది. మొత్తం మీద క్రూజ్‌నాచ్ తిరిగి వచ్చేనాటికి ఆ బాక్సు ఖాళీ అయింది. భావోద్వేగపరులైన రొమాంటిక్స్ ఇలాగే ఉంటారు. పెర్సీ బి షెల్లీ వీళ్ల ప్రవర్తనను ఆమోదించేవాడే.

కాని దంపతుల ఆలోచనలు ఆకాశంలో విహరిస్తున్నాయి. డబ్బుంటే ఎంత, లేకపోతే ఎంత– మార్క్సు ట్రంకు పెట్టెల్లో ఉన్న పెన్నిధితో పోల్చితే. హనీమూన్ కాలంలో చదవటానికి వెంట తీసుకెళ్లిన నలభై అయిదు మహా గ్రంథాలు – హెగెల్, రూసో, మాకెయవెల్లి, షమాబ్రియా ...వగైరా. జెన్నీ ప్రేమలో స్థిమితపడ్డ మార్క్సు, కేవలం పుస్తక పఠనం మాత్రమే కాదు, తాను కొలోన్‌లో నేర్చుకున్న రాజకీయ, ఆర్థిక పాఠాలను పున:పరిశీలించి కొత్త ఆలోచనలకు పదును పెట్టాడు. వాళ్ల వివాహం పరస్పర విశ్వాసానికి, అంకిత భావానికి ప్రతీక. ఆమె ప్రేమ అతని మేధో జ్వాలను రగిలించింది. మొత్తం మీద మార్క్సు హనీమూన్ అధ్యయనం రెండు ముఖ్యమైన ప్రకటనలకు దారితీసింది. ఒకటి : 'మతం ప్రజలకు మత్తు మందు' అన్నది. రెండు : మానవజాతి విముక్తికి దారి చూపేది కార్మికవర్గమే.

అక్టోబర్ చివరిదాకా క్రూజ్‌నాచ్‌లోనే గడిపారు దంపతులు. ఆకాలంలో మార్క్సుకు కేవలం రెండే రెండు విషయాల మీద ధ్యాస. ఒకటి ప్రేమ, రెండు పుస్తకాలు. ఆ చిన్న గ్రామంలో ఎవరితోనూ పెద్దగా సంబంధాలు లేవు. రాత్రంతా పగలంతా ఇద్దరూ ఒకరికొకరు కంపెనీ. అది ప్రేమికుల లోకం. జూలైనాటికి జెన్నీ నెల తప్పింది. మార్క్సు తన మేధో లోకంలో అతి సంక్లిష్టమైన సమస్యలతో తలమునకలుగా వున్నాడు.

అప్పటిదాకా మార్క్సును అత్యధికంగా ప్రభావితం చేసిన తాత్వికుడు హెగెల్ ఒక్కడే. 'హెగెల్ కేవలం భావ ప్రపంచంలో బతుకుతాడు. వాస్తవ లోకంలో కాదు' అన్నప్పుడు కూడా మార్క్సు ఇంకా ఆయన ప్రభావం నుండి బయటపడలేదు. అంటే విభేదాలున్నా, ఇద్దరి మధ్యా పరంజా (Scaffolding) ఇంకా చెక్కు చెదరలేదు. హెగెల్ గతితార్కికతను సొంతం చేసుకున్నాడు మార్క్సు. సైద్ధాంతికతకు పరిమితమైన ఆ వాదాన్ని రాజకీయ కార్యాచరణకు అన్వయించాడు. మార్క్సు ఆలోచనల్లో వచ్చిన మార్పును ప్రభావితం చేసిన మరో వ్యక్తి లుడ్విగ్ ఫాయెర్‌బాక్. ఈయన మార్క్సుకూ, బ్రూనోబార్‌కూ మిత్రుడు. 1841లో తను ప్రచురించిన The Essence of christianity పుస్తకంలో దేవుడనే వాడు మనిషి సృష్టి అని వాదించాడు. అందువల్లనే అతడికి మనిషి లక్షణాలన్నీ ఉన్నాయి. అంటే మనిషి తనను తానే ఆరాధించుకున్నాడు. ఇలా చెయ్యటం వల్ల మనిషిలోని ఉత్తమ లక్షణాలను దేవుడికి ఆపాదించి పరాయీకరణకు పాల్పడ్డాడు. ఫలితంగా పరలోకంలోని 'మనిషి' దేవుడైనాడు. అతడి ముందు ఈ లోకంలోని మనిషి మోకరిల్లి ప్రార్థిస్తున్నాడు. ఆ తర్వాత 1843లో తను ప్రచురించిన వ్యాసాలతో. ఆలోచన దేవుడిలాగే – మనిషి వెలుపల వున్నదనడంలో హెగెల్ పొరబాటు చేశాడు. మనిషే ఆలోచిస్తాడు. ఆ ఆలోచనల నుండే దేవుడూ, తత్వశాస్త్రమూ రూపుదిద్దుకుంటున్నాయి.

రాజ్యం (State) అనేది మనిషికి వెలుపల వున్నదని హెగెల్ భావన. అది మనిషిని నియంత్రిస్తున్నది. ఈ అభిప్రాయం తప్పన్నాడు మార్క్సు. మనుషుల సముదాయమే రాజ్యం. మనుషులు తమ చట్టాలను, తమ రాజ్యాంగాన్ని తామే నిర్మించుకోవాలి. అదే మనిషికీ, రాజ్యానికీ కుదరవలసిన ఒప్పందం.

ఆ తర్వాత 'మతం' గురించి విశ్లేషణాత్మకంగా పరిశోధించాడు. మనిషిలోని ఔన్నత్యమే మత భావన అన్నాడు ఫ్రాయర్‌బాక్. అది మనిషి వేదనకు ప్రతిబింబం అన్నాడు మార్క్సు. మనిషి నిర్మించుకున్న ఈ మత భావన మత్తు మందులాగ అతడికి బాధ నుండి ఉపశమనం కలిగిస్తున్నది. ఈ భావన ముందు నిస్సహాయుడు. నిర్వీర్యుడు మనిషి. పీడిత మానవుల నిట్టూర్పు మతం. హృదయం లేని ఈ ప్రపంచ స్పందన మతం. ప్రజలకు నల్లమందు మతం'.

"ఈ విశాల విశ్వంలో మనిషికి తన వైభవోపేత స్థానం గురించి అవగాహన కలిగించాలి. ఇప్పుడున్న ఈ వ్యవస్థను, విలువల్ని, నమ్మకాల్ని చీల్చి చెండాడితే తప్ప ఇది సాధ్యం కాదు. దీని కోసం ఎవర్నైనా ఎదిరించాల్సిందే. రాజీలేని పోరాటం చెయ్యాల్సిందే." ఈ పనులన్నీ చెయ్యటానికే వార్తా పత్రికను నడపాలని రూగ్‌కు చెప్పాడు మార్క్సు. అయితే, అలాంటి పత్రిక వెలువడగలిగిన నగరం అందుకనువైన వాతావరణం వున్న నగరం ఒక్కటే. అదే పారిస్.

(రెండవ భాగం)

నిలకడలేని కుటుంబం

మేం కొత్త సూత్రాలనేమీ లోకం మీద రుద్దడం లేదు. అసలు విషయమేమంటే, పాత సూత్రాల నుండే కొత్త సూత్రాలను తయారు చేస్తున్నాం.

- కార్ల్ మార్క్సు.

సృజనాత్మక ప్రపంచానికి కేంద్రంగా వున్న పారిస్‌లో చిరకాలంగా అనేక ఉద్యమాలు జరిగాయి. అలాంటిదే ఒకటి 1843 లోనూ జరిగి రాజకీయ రంగు పులుముకుంది. ఆ కాలంలో ఫ్రెంచి, జర్మన్, రష్యన్, పోలిష్, హెంగేరియన్, ఇటాలియన్ సంస్కరణవాదులు, చిత్రకారులు, కవులు, నవలా రచయితలు, సంగీతకారులు, తాత్వికులతో కలిసి తిరిగారు. ఊహా ప్రపంచాన్ని కాక వాస్తవ విషయాలను చర్చించాలన్నారు. అరిస్టోక్రాట్లు, విప్లవకారులతో రహస్య సమావేశాలు జరిపి రాజరికం అమలులో వున్న రాజ్యాలను ప్రజాస్వామ్య దేశాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. ఇతర దేశాల నుండి పారిపోయి వచ్చిన రాజకీయ శరణార్థులకు అక్కడ అపూర్వ గౌరవం లభించింది. సైనికాధికారులు కూడా తమ లాంఛనాలు తొలగించుకుని పౌర జీవితం గడపటానికే ఇష్టపడ్డారు. ఆకర్షణలకు, హోదాలకు మనసు పారేసుకునే పడతులకు మాత్రమే ఇది నిరాశ కలిగించింది.

ఆ సంవత్సరం కింగ్ లూయీ ఫిలిప్ పరిపాలించిన పారిస్ నగర దృశ్యమిది. యూరోప్‌లోని అన్ని రకాల, అన్ని రంగుల రాడికల్స్‌కూ కేంద్రం ఆనాటి పారిస్.

సశేషం

▪ ఫోన్: 91776 18708

'మౌన వేదన' అక్షరమైంది

మౌనంగా వున్న వేదన, అక్షరాలై విస్ఫోటిస్తుంది అనడం అతిశయోక్తి కాదు విడదల సాంబశివరావు విషయంలో.. నాటక రంగంలో సుప్రతిష్ఠులైన కవి! సమాజ సేవలో, మానవతావాద దృక్పథంతో రచనలు చేస్తున్నారు. ప్రపంచ మహాకవి షేక్స్పియర్ జూలియస్ సీజర్ ఇంగ్లీషు నాటకంలో 'మార్క్ ఆంటోని' పాత్రను మనం చూడాలంటే 'విడదల సాంబశివరావు గారిలో చూడాల్సిందే. ఆ పాత్ర అద్భుతంగా చేస్తారు. 1970 ప్రాంతం నుండి ఈ నాటకం వేస్తూనే ఉన్నారు. తొలిగా న్యూఢిల్లీ రవీంద్రభవన్‌లో ప్రదర్శించి మన్ననలు పొందారు. పుణ్యభూమి నా దేశం తలారి తీర్పు/ నాటిక: నాటకాలు/ నంది నాటకోత్సవాల్లో ప్రదర్శించబడ్డాయి. దాదాపు 10 నాటకాలు దాకా రాశారు. సరికొత్త ప్రేమ లేఖ (నవల) : మౌన వేదన (కవిత్వం) ఇటీవల కాలంలో ప్రచురించిన పుస్తకాలు నీహారిక ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామాజిక – సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వీరి కవిత్వం మానవత్వ పరిమళాలతో గుబాళిస్తుంది! ఆలోచింపజేస్తుంది. కంట కన్నీరు తెప్పిస్తుంది. అమ్మ అనే కవితలో ఇలా అంటారు...

మౌన వేదన, కవి : విడదల సాంబశివరావు, పేజీలు : 93, ధర :రూ. 100/-, ప్రతులకు : కవి పేరుతో.., హౌస్ నెం : 3-173/1, 7వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట- 522616.

'ఇంట్లో వుంచుకున్నా! వృద్ధాశ్రమంలో వుంచినా!
అమ్మ మనసు పొరల్లో! నిరంతరం నిక్షిప్తమై ఉండేది!

సముద్రమంత ప్రేమే! అంటారు. తల్లి ప్రేమను రాయని కవి ఉండరు. తల్లి గురించి ఎంత చెప్పినా... రాసినా తక్కువే. నవమాసాలు మోసి కన్న పేగు బంధం అది.

జాతి జీవన వికాసం కోసం/ నైతిక విలువల కోసం
విజృంభించి పోరుబాట పట్టినవాడు/

ఈ ముసురు విచ్ఛిన్నమౌతుంది/ అంటారు ముసురు కవితలో! ఈ కవితలో బంధుప్రీతి, భ్రూణహత్యలు, లైంగిక వేధింపులు, మానభంగాలు, కిడ్నాపులు, కిరాయి హత్యలు, ఎల్లో జర్నలిజాలు, బ్రాంది షాపులు తీవ్రవాదం, అసమానత్వం, కుహనా రాజకీయ భారతావనిలోని అరాచకం తొలగాలంటే యువతరం కదలాలి అనే సందేశం 'ముసురు' కవితలో ఇచ్చారు.

విశ్వం విస్తుపోయిన వేళ... ఉత్తర ద్వారంలో ఉపద్రవం.. రేపటి శత్రువు, మనిషితనం మాటున... రాక్షసక్రీడ.. హరితవనంలో అపశృతులు లాంటి కవితలు.. పాఠకుల మెదళ్లకు పదును పెడతాయి.

'నేల తల్లిని అమ్ముకోవడం/ ఆత్మహత్య సదృశ్యంగా భావించి,
ప్రాణాన్నే పణంగా పెట్టి/ జీవన మూలాధారమైన...కిడ్నీలను' విక్రయించి,
అప్పుల కౌగిలి నుండి విముక్తుడై/ ఈనాడు రైతన్న/ రేపటి తొలకరి కోసం/ ఎదురుచూస్తే!? అంటే భారత రైతాంగ ప్రతినిధిగా కవి నిలిచి... అన్నం పెట్టే రైతుకు అండగా నిలబడటం రైతాంగ కుటుంబ నేపథ్యం కవికే సాధ్యం...

- ప్రసన్నకుమారి

నారాయణమూర్తి ఆలోచనల అంతర్వాణి

ఈ పుస్తకాన్ని అక్షత, రోహన్, యువ ఇన్ఫోసియన్‌లకు, దేశంలోని ప్రపంచ యువతకు, మెరుగైన భారతదేశాన్ని, మెరుగైన ప్రపంచాన్ని సృష్టిస్తారనే నమ్మకంతో వారికి అంకితం చేశారు నారాయణమూర్తి. పుస్తకం అట్టవెనుక నాటి భారతదేశ ప్రధాని డా॥మన్మోహన్‌సింగ్, మైక్రోసాఫ్ట్ దిగ్గజం, బిల్‌గేట్స్‌ల అభిప్రాయాలు ప్రచురించారు. ఇది నారాయణమూర్తి ప్రసంగాలు, అనుభవాల సంకలనం. 39 సంవత్సరాల చరిత్ర కలిగిన మైక్రోసాఫ్ట్‌ను 49 ఏళ్ల వయస్సుగల తెలుగువాడు సత్య నాదెళ్ల (సి.ఇ.ఓ) సారథ్యం వహించి ఒక సంవత్సరానికి 112 కోట్ల జీతం (4-2-2014 నుండి)



యువతతో జగతి ముందుకు, రచన : ఎన్. ఆర్. నారాయణమూర్తి. అనువాదం : వసుంధర, పేజీలు : 317, ధర: రూ. 260/-, ప్రతులకు : అలకనంద ప్రచురణలు- 59-6-15 కంచుకోట వీధి, మేరిస్టెల్లా కాలేజీ ఎదుట- విజయవాడ- 520008.

తీసుకొంటున్నాడు. మైక్రోసాఫ్ట్ కంపెనీ (విండోస్) వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు. ట్యాబ్లెట్లు, ఫ్యాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లు రాకతో మైక్రోసాఫ్ట్ ఇబ్బందులు మొదలైనాయి(ట)? సాఫ్ట్‌వేర్ నిపుణులే అంటున్నారు. మొబైల్ రంగంలో గూగుల్ తన ఉనికి ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఆండ్రాయిడ్ వంటి మొబైల్ సాఫ్ట్‌వేర్లు రూపొందించి మైక్రోసాఫ్ట్‌ను వెనక్కి నెట్టింది. ఆండ్రాయిడ్‌లో ఉండే ఆప్షన్లు ప్రత్యేకతను చాటుకొంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు వహించుతున్న అంతర్జాతీయ కంపెనీల వ్యాపారం 35000 కోట్ల డాలర్లు పైమాటే. ఇక ఈ పుస్తకంలో కార్పొరేటిజం, నూతన సంస్కరణలు, ఆర్థిక విధానాల్లోని ఫలితాలు, మంచిపనులు, దేశ ప్రయోజనాలకు ఉపకరించే సాంకేతిక శాస్త్ర ఫలితాల తీరుతెన్నుల్ని చర్చించారు నారాయణమూర్తి. 1981లో ఇన్ఫోసిస్ స్థాపన, 2007 నాటికి 300 కోట్ల డాలర్లు వ్యాపారానికి ఎదగడం – దీని షేర్ల విలువ దాదాపు 2,700 కోట్ల డాలర్లు చేరడం (పేజీ. 181) లాంటి అంశాలు యువ పాఠకుల్ని ఆకర్షిస్తాయి. కంప్యూటర్ ఇంజనీరింగ్, ఐటి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ అధ్యయన విద్యార్థులకు, ఉద్యోగులకు ఉపయోగపడే సమాచారాన్ని ఈ పుస్తకం అందిస్తుంది. ప్రేరణ ఇస్తుంది. నారామణమూర్తి ఆత్మకథలా సాగే ఈ గ్రంథం కంప్యూటర్ సాంకేతికరంగ వివరాలు తెలియజేస్తుంది.

- టి.సి

చుక్కలు కలిపేద్దాం



పిల్ల - తల్లి

బొమ్మలో తల్లీ పిల్లలున్నాయి కదా...! ఏ పిల్ల ఏ తల్లికి చెందినదో గుర్తించి జత చేయండి చూద్దాం!

ఎక్కడున్నాయబ్బా...!



హాయ్ పిల్లలూ! కింద ఇచ్చిన బాక్సులో ఏడు బొమ్మలున్నాయి కదా. అవి పై బొమ్మలో దాక్కున్నాయి. మీరు వాటిని గుర్తించండి.

నా బొమ్మ

జి. మౌర్య మణి దీపక్,
మూడో తరగతి,
శ్రీ భావన విద్యా నికేతన్,
క్రాంతినగర్,
సత్యం జంక్షన్ రోడ్,
విశాఖపట్నం.

లెక్కించండి



పిల్లలూ మీకు లెక్కలు బాగా వచ్చు కదా! అయితే బొమ్మలో ఇచ్చినవి చూసి చేసేయండి.

జత చేయాలి



ఈ బొమ్మలో ఏయే జంతువులు వేటిని ఆహారంగా తీసుకుంటాయో గుర్తించి జతచేయండి.

బుడగలు ఎన్నబ్బా...



ఈ అబ్బాయి బుడగల్ని ఊదుతున్నాడు. ఇంతకీ ఎన్ని ఉన్నాయో లెక్కిస్తారా!

నీళ్లలోనూ చూసేది



నీటిలో వేటినైనా చూడాలంటే ఈ కిందివాటిలో వేటిని ఉపయోగిస్తారు. సరైనది ఏదో కనిపెట్టండి.

ఏడు తప్పులు ఏవోచ్

ఈ బొమ్మలో ఏడు తప్పులున్నాయ్.. వాటిని మీరు కనుక్కొని సున్నా చుట్టేయండి.

నందు తుమ్ము

పాలాల దగ్గర... పల్లె రాహదారిలో దేవ్, సోను మిత్రబృందం కబుర్లు చెప్పుకుంటూ నడుస్తోంది.)

దేవ్: మన నందు నిన్న గొప్ప పని చేశాడు, తెలుసా?

అందరు: ఏం చేశాడు?

దేవ్: నందుకి తుమ్ముల రోగం ఉందని తెలిసిందే కదా! మా ఇంటికి వచ్చిన మా మామయ్య ... పూర్తిగా తెల్లారకముందే... చీకట్లోనే వాహ్యాళికి బయల్దేరాడు. ఇంటి దగ్గర నుంచి అలా పదడుగులు వేశాడో లేదో చెరువు దగ్గర నందు తుమ్ము వినపడింది. నందు డాబా మీద పడుకుని ఉన్నాడు. మామయ్యా దాకా శబ్దం వచ్చేసరికి ఆయన బాంబేదో పేలిందనుకుని మూర్ఛ పోయాడు. మన రాంబాబు మామయ్య సమయానికి అటునుండి వెళతున్నాడు కనక ఆయన చూసి గుర్తుపట్టాడు.

అందరు: అంటే నిజంగానే నందు గొప్ప పనే చేశాడు.

దేవ్: ఏముంది, రాంబాబు మామయ్యాని భుజంమీద వేసుకుని వైద్యుడు గంగారాం దగ్గరకు తీసుకుపోయాడు. ఊపిరి ఆడుతోంది. చాలాసేపు సపర్యలు చేసి స్పృహ వచ్చాక ఇంటికొచ్చాడు. ఆయన పాపం పులి గాండ్రించిందనుకున్నాడు.

అందరు: అయితే మామయ్య ఏమన్నాడు? నందుకి కానుక ఇవ్వాల్సింది.

దేవ్: అది పులి కాదు, బక్కపాటి నందు తుమ్మేనని చెప్పాక ఆ పిల్లాడిని చూడాలన్నాడు. నందుని తీసుకొచ్చాక ఆయన నవ్వుతూ వాడి తల నిమురుతూ 'గుండె గుభేలుమనిపించావు కదయ్యా' అని వంద రూపాయల నోటు నందు చేతులో పెట్టాడు.

✡✡✡

(నందు ఇంట్లో...)

నందు: అమ్మా, ఈ తుమ్ముల వల్ల పెద్ద చిక్కే వచ్చి పడింది. ఉదయం దేవ్ వాళ్ళ మామయ్య నా తుమ్ముకి మూర్ఛ పోయాడు. నాకీ రోగం ఎప్పటి నుంది ఉంది. ఏం చేయాలి?

తల్లి: మీ నాన్న పోయిన దగ్గర నుండి నీకీ తుమ్ములు పట్టుకున్నాయి. గంగారాం వైద్యుడికి ఎన్నోసార్లు చూపించినా ఫలితం లేకపోయింది. అయినా నీ తుమ్ము వల్ల అందరి పనులు బాగా అయిపోతూ ఉంటాయి.

పుష్ప పిన్ని: (ఇంతలో ఇంట్లోకి వస్తూ) నందూ! నీ తుమ్ముకి నా ఉట్టి కింద పడి ... పెరుగంతా పాడైపోయింది.

కమల: సరేలే, నీకు కావల్సిన పెరుగు తీసుకో. కాని పార్వతి కొడుకుని పులి బారి నుండి నందు కాపాడలేదా?

పుష్ప: అవునవును, పార్వతి కొడుకుని పులి ఎత్తుకు పోయేదే! కాని సరిగ్గా ఆ సమయానికి సమీపంలో వున్న నందుకు తుమ్ములు మొదలవటంతో పులి భయపడి పారిపోయింది. పార్వతి ఎప్పుడూ తల్చుకుంటూనే ఉంటుంది.

✡✡✡

(ఊళ్లో పిల్లలంతా చాటింపు వేస్తున్న వ్యక్తిని చుట్టుముట్టారు)

చాటింపు వేసే వ్యక్తి: అందరికి తెలియ చేసేదేమనగా! ఈ సాయంత్రం మన ఊరి గోదాలో... పేరు మోసిన పహిల్వాన్ల కుస్తీ ఉంది. పొరుగూరి మీసాల మల్లన్న మన ఊరివాళ్ళకు సవాలు విసిరాడు. ఊరంతా హాజరు కావాలి.... ఢం... ఢం... ఢం.

సోను: (మిగతా పిల్లలతో) మన నందుని రంగంలోకి దింపితే ఎలా ఉంటుంది? మీసాల మల్లన్నకి .... నందు గాడి తుమ్ము చాలు.

అంతా: భలే, భలే! దాంతో వాడి ఆట కట్టు!

✡✡✡

(సాయంత్రం గోదాలో మీసాల మల్లన్న... తన మీసాలు దువ్వుతూ గర్వంగా తిరుగుతున్నాడు.)

సర్పంచ్ సుబ్బయ్య : సిగ్గు చేటు, మన ఊళ్ళో ఒక్కడు లేడా మల్లన్నతో పోటీ పడటానికి? నా వళ్ళు మండిపోతోంది. కాని ఏం చేయను? వయసుడిగినవాడిని. సరే, ఓటమే కాని, నేను ప్రకటన.......

జనం: ఆగండి, మన నందు ఉన్నాడు...

నందు: బెంగపడొద్దు సుబ్బయ్య మామా, నేనున్నానుగా!

(కుస్తీ మొదలైంది. నందు, మల్లన్న తలపడ్డారు.)

దేవ్: అదుగో, నందు ... మల్లన్న కాళ్ళ మధ్య దూరి అతన్ని కింద పడేశాడు. ఆయన ముక్కు పచ్చడైపోయి ఉంటుంది.

జనం: కాని ఆయన చిత్తవలేదు కదా!

(ఇంతలో నందు జోరుగా తుమ్మాడు. మీసాల మల్లన్న దిమ్మ తిరిగి వెల్లకిలా పడిపోయాడు. నందు వాడిని చిత్తు చేశాడు.)

అందరు: నందు గెలిచేశాడు. మన ఊరి పరువు కాపాడాడు. నందుకి జై.

✡✡✡

దేవ్: మీసాల మల్లన్నని ఓడించిన దగ్గర నుండి నందు తుమ్ములు పోయాయి.

అందరు: ఇక మన ఊరికి తుమ్ముపురం అనే బిరుదు ఎలా దక్కుతుంది?!

(అప్పుడే పెద్దగా తుమ్మే శబ్దం వినపడుతుంది. అందరు సరదాగా నవ్వటం మొదలెట్టారు.)

మూలం : **ప్రకాష్ మను**

తెలుగు : **వేదుల రామకృష్ణ**

అందమంతా అందులోనే

ఒక్కోసారి అనిపిస్తుంది. ఏంటీ ఇలా వుంటే అందంగా వున్నట్టా అని! ఆశ్చర్యానందాల నుంచి తేరుకున్నాక 'అక్కడలా కావొసు!' అనుకుని సరిపెట్టుకుంటాం. ఇప్పడెంత సన్నగా వుంటే అంత అందంగా వున్నట్టు లెక్క. అయితే ఓ తెగలో లావుగా వున్న ఆడవాళ్లని అందగత్తెల కింద లెక్కిస్తారట. పళ్లు ఊడపీకించుకున్నవారిని, చిగుళ్లను నల్లగా చేయించుకున్నవారిని, దంతాలను చదరంగా చెక్కించుకున్నవారిని అందగత్తెల కింద జమ కట్టడం చూస్తూనే వున్నాం. అలా ఇప్పడు మీ ముందుకొచ్చిన ఈ భామ కూడా వాళ్ల తెగలో అందగత్తె కింద లెక్క. ఇథియోపియాలోని ఒమో రోవర్ లోయలో కన్పిస్తారు సుర్మా తెగ మహిళలు. వీరి కింది పెదవికి పళ్లేల్లాంటి ఆభరణాలు ధరిస్తుంటారు. ఇలా ఎంత పెద్ద పళ్లేలను తగిలించుకుంటే వారు అంత అందంగా వున్నట్టు. సరిగ్గా చెప్పకోవాలంటే... ఓ మహిళ అందం, హోదా, ఆమెకు లభించే కట్నం...అంతా ఈ పళ్లెం మీదనే ఆధారపడి వుంటుంది. పెద్ద పళ్లెం ధరించిన అమ్మాయికి కట్నం ఎక్కువగా ఇస్తారు. అంటే ఆమె కుటుంబానికి పెళ్లి సమయంలో పశువుల రూపంలో కట్నం సమర్పించుకుంటాడు అబ్బాయి. అమ్మాయికి 15-18 ఏళ్ల మధ్యలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. ముందుగా కింది రెండు పళ్లను తొలగించి ... పెదవిని సాగదీసే కార్యక్రమం చేపడతారు. ఇవాళ మీ ముందుకొచ్చిన ఈ సుర్మా మహిళ పేరు అతాయె ఎలిజిడాగ్నె. రెండు పదుల వయసుంటుందేమో. కానీ ఆమె ధరించిన పళ్లెం వ్యాసం దగ్గర దగ్గరగా 19.5 సెంమీ వుంటుంది. సినిమా రంగానికి చెందిన అబ్రహం జోఫె... ఈమెను చూసి..ఓ డాక్యుమెంటరీ కూడా తీసేశాడు. అయితే మీ అమ్మాయి కూడా ఇలా పళ్లెం పెట్టుకుంటుందా? అనడిగిగే అతాయె ఏమని చెప్పిందో తెల్సా!? 'అది ఆమె ఇష్టం?' అని.

విశేషం ఏమంటే... ఈ విషయమై గిన్నిస్ బుక్‌లో ఎక్కిన మహిళ ధరించిన పళ్లెం వ్యాసం కేవలం 15 సెంటీమీటర్లేనట.



అబ్రహం, అతాయె

యోగా బామ్మ గారు





"బం చిక్ చిక్ బం చెయ్యి బాగా ... ఒంటికి యోగా మంచిదేగా... లేజీగా ఒళ్లు పెంచుకోక... నాజూగ్గా వుంచు తీగలాగా... ఈజీయేగా రాజయోగ ... ఏజ్‌ని మరిపిం చెయ్యగా... ఈడు ముడతల ధూళి దులుపునుగా... " అంటోందీ తొంబై ఆరేళ్ల బామ్మగారు తావో పోర్చోవ్ లించ్. చూశారుగా... సెంచరీకి దగ్గరల్లో వున్నా... ఎంత సునాయాసంగా ఆసనాలు వేసేస్తోందో. న్యూయార్క్‌లో ఇప్పటికీ విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తోంది. చెప్తే ఆశ్చర్యపోతారు కానీ ఈ బామ్మగారు గత డెబ్బై ఏళ్లగా యోగా చేస్తూనే వుంది. ఉదయాన్నే ఐదు గంటలకే ఆమె దినచర్య ప్రారంభమౌతుంది. అతి కష్టమైన యోగాసనాలను సైతం వేసి తన విద్యార్థులకు నేర్పుతుంటుంది. ఈ వయసులోనూ ఇంత ఆరోగ్యంగా... ఉత్సాహంగా... వుండడంలో రహస్యం ఏంటనుకున్నారు? శాకాహారమేనట. అప్పుడప్పుడు... ఓ గ్లాసు మందు... ఒక చిన్న చాక్లెట్ చప్పరిస్తుంటుందట. రెండేళ్ల కిందటే అత్యంత వృద్ధ యోగా టీచర్‌గా గిన్నిస్ బుక్‌లోకి కూడా ఎక్కేసింది తావో బామ్మ. ఇంతవరకూ ఎవ్వరూ ఆమెను బీట్ చెయ్యలేకపోయారు మరి. ఇక ముందు కూడా చెయ్యలేరేమో! అన్నిటి కంటే ఆశ్చర్యకర విషయం ఏమంటే... తావో బామ్మ పుట్టింది...పెరిగింది మన దేశంలోనేనట. బ్రేవో యోగా బామ్మగారూ...!